

## ఫిరోజ్‌పై దాడి ఘటనలో
# నిందితుడికి రిమాండ్

**నంద్యాల క్రైం, సెప్టెంబరు 16:** మంత్రి ఫరూక్ తనయుడు, టీడీపీ నాయకుడు ఎన్‌ఎండీ ఫిరోజ్‌పై ఆదివారం రాత్రి జరిగిన దాడి కేసులో వెంకటేశ్వరరెడ్డిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు వన్‌టౌన్ సీఐ సుధాకర్‌రెడ్డి సోమవారం తెలిపారు. ఫిరోజ్ ఫిర్యాదు మేరకు హత్యాయత్నం కింద కేసు నమోదు చేసి న్యాయాధికారి ఎదుట హాజరు పరచగా రిమాండ్ విధించినట్లు సీఐ చెప్పారు.

# పెరుగుతున్న జ్వర పీడితులు





రక్త పరీక్షల ల్యాబ్ వద్ద వేచి ఉన్న రోగులు

**నంద్యాల, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి):** జిల్లాలోని ప్రజలు సీజనల్ వ్యాధులతో మంచం పట్టారు. జలుబు, జ్వరాలతో ఆసుపత్రుల్లో చేరే వారి సంఖ్య పెరుగుతోంది. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో ఓపీ కౌంటర్లు నాలుగు మాత్రమే ఉండడంతో ఓపీ తీసుకునేందుకు రోగులు ఎక్కువ సమయం వేచి చూడాల్సి వస్తోంది. దీనికి తోడు సిబ్బంది కొరత కూడా వేధిస్తోంది. దీంతో వైద్య పరీక్షలు చేయకుండానే మందులు రాసి పంపుతున్నారన్న విమర్శలు ఉన్నాయి. ఇక పెరుగుతున్న జ్వర పీడితులకు అనుగుణంగా ప్రత్యేకంగా ఫీవర్ వార్డు అంటూ ఏమీ ఏర్పాటు చేయలేదు. మిగిలిన వ్యాధులతో బాధపడుతున్న వారిని, జ్వరపీడితులను ఒకే వార్డులో ఉంచి చికిత్స అందిస్తున్నారు. ఇక జిల్లా ఆస్పత్రి దూరమని భావించే వారు ఆయా గ్రామాల పరిధిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లకు వెళుతున్నారు. ఫలితంగా ఆయా ఆస్పత్రులకు కూడా రోగుల తాకిడి ఎక్కువగానే ఉంటోంది. అక్కడ కూడా వైద్యులు, సిబ్బంది కొరత ఉండటంతో సరైన వైద్యం అందక రోగులు ఇబ్బంది పడుతున్నారు. ఇటీవల కాలం వరకు నంద్యాల ప్రభుత్వ ఆస్పత్రికి ఓపీ 800 నుంచి 1000 వరకు ఉండేది. మొన్న వరుసగా కురిసిన వర్షాలకు జిల్లా వ్యాప్తంగా సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. దీంతో ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చే వారు విపరీతంగా పెరగటంతో ఓపీ 1200పైనే ఉంటోంది.

### జ్వరాల వివరాలు..

ప్రభుత్వాసుపత్రిలో నమోదవుతున్న జ్వరాలు
జిల్లా వ్యాప్తంగా మే నుంచి నమోదైన డెంగీ, మలేరియా కేసులు

| | | డెంగీ కేసులు | మలేరియా కేసులు |
|---|---|---|---|
| మే | 165 | 8 | 0 |
| జూన్ | 192 | 14 | 2 |
| జూలై | 599 | 14 | 3 |
| ఆగస్టు | 803 | 27 | 2 |

**కిటకిటలాడుతున్న ఆస్పత్రులు**

### పారిశుధ్య లోపంతోనే..

పారిశుధ్య లోపం కారణంగా గ్రామాల్లో వ్యాధులు వ్యాప్తి చెందుతున్నాయి. దోమల నివారణ కోసం బ్లీచింగ్ చల్లడం, ఫాగింగ్ వంటివి కూడా చేయడం లేదన్న విమర్శలు వస్తున్నాయి. మేజర్ పంచాయతీల్లో సైతం ఇదే పరిస్థితి ఉండటం గమనార్హం. ఇప్పటికైనా అధికారులు గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్యంపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.



ప్రభుత్వాసుపత్రిలో పురుషుల వార్డు

### రక్త పరీక్షలకు క్యూ..

ప్రతి ఏడాది జూన్, జూలై మొదలు కాగానే సీజనల్ జ్వరాలు ప్రబలుతుంటాయి. జూన్‌లో జిల్లా ప్రభుత్వాసుపత్రిలో జ్వరాల కేసులు 192 నమోదు కాగా, జూలైలో వీటి సంఖ్య ఒకేసారి 599కి పెరిగింది. ఇక ఆగస్టులో వీటి సంఖ్య అమాంతం 803కి చేరింది. ఆస్పత్రికి వచ్చే రోగులు సాధారణ జ్వరంతో వస్తున్నారా? లేక డెంగీ, మలేరియా జ్వరాలతో వస్తున్నారా? అనే విషయం తెలియక వైద్యులు రక్త పరీక్షలు రాస్తున్నారు. దీంతో నంద్యాల ప్రభుత్వాసుపత్రిలోని రక్త పరీక్షలు చేసే ల్యాబ్ జ్వర పీడితులతో కిక్కిరిసిపోతోంది. ఈ ఏడాది మే నుంచి ఇప్పటి వరకు 12 మలేరియా కేసులు, 63 డెంగీ కేసులు నమోదయ్యాయి. ఇక సాధారణ జ్వరాలైతే చెప్పనక్కర లేదు. జ్వరాల ప్రభావంతో చిన్న పిల్లల ఆస్పత్రులు కిటకిటలాడుతున్నాయి. జ్వరాలకు సంబంధించిన సమాచారంపై స్పష్టత ఉండటం లేదు. ఆర్‌ఎంపీ, పీఎంపీలు నుంచి లెక్కలు రావటం లేదు. అధికారులు ప్రైవేటు, కార్పొరేటు ఆస్పత్రుల నుంచి లెక్కలు తీసుకుని వాటి ఆధారంగా ఎక్కడెక్కడ ఎక్కువ కేసులు నమోదువుతున్నాయో? ఆయా ప్రాంతాలపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తే బాగుంటుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.



రక్త పరీక్షల చీటీ రాయించుకునేందుకు వేచి ఉన్న రోగులు

## జ్వరాల బారిన సుగాలిమెట్ట



ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సుగాలీలు

**పాణ్యం, సెప్టెంబరు 16 :** మండలంలోని సుగాలిమెట్ట గ్రామం జ్వరాల బారినపడింది. ప్రతి ఒక్కరూ జలుబు, జ్వరాలతో బాధపడుతున్నారు. సరైన వైద్యం అందుబాటులో లేకపోవడంతో సుగాలీలు పాణ్యం, నంద్యాల తదితర ప్రాంతాలలోని ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయిసున్నారు. పారిశుధ్యం పనుల్లో భాగంగా బ్లీచింగ్ పౌడర్ చల్లడానికి సైతం నిధులు లేని పరిస్థితి నెలకొంది. రోగులకు అందించాల్సిన మందులు, సెలైన్ బాటిళ్లు సచివాలయంలో నిరుపయోగంగా మారినట్లు స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు.



### గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేయాలి

గ్రామంలో విషజ్వరాలు పెరుగుతున్న కారణంగా వైద్య శిబిరం ఏర్పాటు చేయాలి. దోమల నివారణకు బ్లీచింగ్ పౌడర్ పిచికారి చేయాలి. మురుగు కాల్వలు శుభ్రం చేయాలి. గ్రామంలోని ప్రజలు అధికారులతో సహకరించాల్సి ఉంది. సచివాలయ వైద్య సిబ్బంది పర్యవేక్షణ లేక వీధుల్లో పారిశుధ్యం లోపించింది.

-తిరుపాల్ నాయక్, సుగాలిమెట్ట

## ఘనంగా మిలాద్ ఉన్ నబీ

**పాణ్యం, సెప్టెంబరు 16:** మిలాద్ ఉన్ నబీ వేడుకలను పాణ్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక షరీఫ్ దర్గా వద్ద ముత్తవలి ఖాదర్‌బేగ్ ఆధ్వర్యంలో మహ్మద్ ప్రవక్త కేశములను ప్రదర్శించారు. ఈ కేశాలను ముస్లింలు సందర్శించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పర్వదిన సందర్భంగా వివిధ గ్రామాలనుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. దర్గా ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో దర్గా నిర్వాహకులు అఫ్జల్‌బేగ్, జంషీర్‌బేగ్, అర్షద్‌బేగ్ తదితరులు పాల్గొన్నారు.

**పాములపాడు:** మండలంలోని ముస్లింలు ఘనంగా మిలాద్ ఉన్ నబీ పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించారు. సోమవారం ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మత పెద్దలు మాట్లాడుతూ మహమ్మద్ ప్రవక్త జన్మదినాన్ని కొన్ని ముంస్లిం తెగలు ఈద్-ఏ-మిలాద్-ఉన్‌నబిగా నిర్వహించుకుంటారని చెప్పారు.

**ఆత్మకూరు:** పట్టణంలో సోమవారం మహ్మద్‌ప్రవక్త జయంతిని పురస్కరించుకుని మిలాద్ ఉన్ నబీ వేడుకలను ముస్లింలు ఘనంగా నిర్వహించుకున్నారు. సంత మార్కెట్ సమీపంలోని అసర్‌మసీద్‌లో అసర్ వంశస్థులు మహ్మద్ ప్రవక్త కేశ దర్శన భాగ్యాన్ని కల్పించారు. మతపెద్దలు మాట్లాడుతూ మహ్మద్ ప్రవక్త బోధనలు ఆచరణీయమని చెప్పారు. ప్రపంచశాంతి ప్రవక్త మార్గదర్శకాలు ఎంతో అవసరమని వివరించారు. కలిమిలో, లేమిలో ఏ స్థితిలో ఉన్నా మనిషి అహింస, శాంతి, సహనం వంటి లక్షణాలు అలవర్చుకోవాలని సూచించారు. పట్టణంలోని మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.



ఆత్మకూరులో మహ్మద్ ప్రవక్త కేశాన్ని ప్రదర్శిస్తున్న దృశ్యం

## 3 నుంచి దసరా ఉత్సవాలు

### వివరాలు వెల్లడించిన ఈవో శ్రీనివాసరెడ్డి

**మహానంది, సెప్టెంబరు 16:** దసరా ఉత్సవాలను వచ్చే నెల 3వ తేదీ నుంచి 12 వరకు నిర్వహించనున్నట్లు మహానంది ఆలయ ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి తెలిపారు. సోమవారం సాయంత్రం మహానంది దేవస్థానం ప్రధాన కార్యాలయంలో శరన్నరాత్రి ఉత్సవాల ఏర్పాట్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్సవాల్లో భాగంగా ప్రతి రోజూ ఆలయ ప్రాంగణంలోని కామేశ్వరీదేవి అమ్మవారికి విశేష పూజలు నిర్వహిస్తామని అన్నారు. ప్రత్యేక యాగశాలల్లో హోమాలు, కుంకుమార్చన పూజలు ప్రత్యేక రుత్వికులు చేపడతారని వివరించారు. రోజుకో అలంకారంతో అమ్మవారికి గ్రామోత్సవం నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఏఈఓలు ఎర్రమల్ల మధు, వెంకటేశ్వర్లు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ శశిధర్‌రెడ్డితోపాటు ప్రధాన అర్చకులు మామిళ్ళపల్లి అర్జునశర్మ, వేదపండితులు రవిశంకర్ అవధాని, ఉప ప్రధాన అర్చకులు జనార్దన్‌శర్మలు పాల్గొన్నారు.



సిబ్బందితో సమీక్ష నిర్వహిస్తున్న ఈవో శ్రీనివాసరెడ్డి

## శ్రీశైలంలో వెండి రథోత్సవం

**శ్రీశైలం, సెప్టెంబరు 16:** శ్రీశైల క్షేత్రంలో సోమవారాన్ని పురస్కరించుకొని భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్లకు సాయంత్రం సహస్ర దీపాలంకరణ సేవను దేవస్థానం ఘనంగా నిర్వహించింది. కార్యక్రమంలో ముందుగా స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి వేదికపై ఆశీనులుజేశారు. అనంతరం అర్చకులు వేదమంత్రోచ్ఛరణలతో పూజలు చేశారు. అనంతరం సహస్ర దీపాలంకరణ సేవను నిర్వహించారు. తరువాత స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను వెండి రథంపై ఆశీనులనుజేసి ప్రత్యేక పూజలు, మంగళహారతులు జరిపి ఆలయ ప్రాంగణంలో రథోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.



రథోత్సవాన్ని నిర్వహిస్తున్న అర్చకులు, అధికారులు, సిబ్బంది

## శ్రీశైలానికి స్వల్పంగా ఇన్‌ఫ్లో



శ్రీశైలం డ్యాం

**శ్రీశైలం, సెప్టెంబరు 16:** శ్రీశైలం జలాశయానికి ఎగువ పరివాహక ప్రాంతాల నుంచి సోమవారం వరద ప్రవాహం స్వల్పంగా కొనసాగుతోంది. జూరాల నుంచి 27,447 క్యూసెక్కులు, సుకేసుల నుంచి 11,238 క్యూసెక్కులు మొత్తం 38,685 వరద వస్తోంది. సోమవారం సాయంత్రం 6 గంటల సమయానికి జలాశయానికి 40,764 క్యూసెక్కుల మేర వరద వచ్చింది. శ్రీశైలం జలాశయం పూర్తి స్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా ప్రస్తుత నీటి మట్టం 882.50 అడుగులుగా నమోదైంది. జలాశయం పూర్తి స్థాయి నీటి నిల్వ 215.807 టీఎంసీలు కాగా ప్రస్తుత నీటి నిల్వ 202.0439 టీఎంసీలుగా నమోదైంది. ఆంధ్రప్రదేశ్ జల విద్యుత్ కేంద్రం ద్వారా 30,867 క్యూసెక్కులు, తెలంగాణ జల విద్యుత్ కేంద్రం ద్వారా 37,116 క్యూసెక్కుల నీటితో విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తున్నారు.

## దాడులకు పాల్పడటం మంచి పద్ధతి కాదు

### టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్‌ఎండీ ఫిరోజ్

**నంద్యాల రూరల్, సెప్టెంబరు 16 :** తనపై భౌతిక దాడికి పాల్పడటం మంచి పద్ధతి కాదని నంద్యాల ప్రజలు ఫ్యాక్షనిజాన్ని సహించరని మంత్రి ఫరూక్ తనయుడు, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్‌ఎండీ ఫిరోజ్ అన్నారు. ఆదివారం రాత్రి టీడీపీ కార్యాలయం ఎదుట ఆయనపై దాడికి పాల్పడిన ఘటనపై సోమవారం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఫిరోజ్ మాట్లాడారు. తనపై జరిగిన దాడి యత్నం దురదృష్టకరమన్నారు. డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ జన్మదిన వేడుకల్లో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో టీడీపీలోని మరో వర్గానికి చెందిన నాయకుడి ఫొటో లేదని తనకు పదేపదే ఫోన్ చేస్తూ బెదిరింపులకు దిగారన్నారు. సమస్య ఉంటే కార్యాలయం వద్దకు వచ్చి మాట్లాడాలని చెప్పానని, అయితే ఓ వర్గానికి చెందిన కొంతమంది వ్యక్తులు మద్యం తాగి తన వాహనాన్ని అడ్డుకొని దాడికి యత్నించారని తెలిపారు. తనకు సంబంధంలేని విషయాల్లో రాజకీయ కుట్రతో ఇలాంటి ఘటనలకు పాల్పడవద్దని కోరారు. గ్రామాల్లో గ్రూపు రాజకీయాలు సహజంగా ఉంటాయని, తన గ్రూపును కాపాడుకోవాల్సిన బాధ్యత నాయకులపై ఉంటుందని, అంతమాత్రాన ఆ అంశాన్ని వ్యక్తిగతంగా తీసుకొని దాడికి పాల్పడటం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. దాడికి పాల్పడిన వారిని పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారని తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎన్‌ఎండీ ఫిరోజ్

## నేటి నుంచి వంట ఏజెన్సీ మహిళలకు శిక్షణ

**కర్నూలు(ఎడ్యుకేషన్), సెప్టెంబరు 16:** ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం తయారు చేసే కుక్‌లకు, హెల్పర్లకు ఈ నెల 17 నుంచి 21 వరకు మ్యాపింగ్ చేయబడిన పాఠశాలలో శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 1433 పాఠశాలల వంట మనుషులకు, అసిస్టెంట్ కుక్‌లకు శిక్షణ ఇవ్వాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. శిక్షణలో నాణ్యమైన భోజనం ఎలా తయారు చేసి అందించాలో నిపుణులతో శిక్షణ ఇప్పించనున్నారు. పాఠశాలల ప్రధానోపాధ్యాయులు విధిగా కుక్‌లను, హెల్పర్లను శిక్షణకు పంపాలన్నారు. అలాగే ఎంఈవోలు శిక్షణ కార్యక్రమాలకు హాజరు కావాలని డీఈవో సూచించారు.

## మంత్రాలయంలో కర్ణాటక హైకోర్టు జడ్జి



మంచాలమ్మ సన్నిధిలో కర్ణాటక హైకోర్టు జడ్జి జస్టిస్ రామచంద్ర

**మంత్రాలయం, సెప్టెంబరు 16:** మంత్రాలయం రాఘవేంద్ర స్వామి దర్శనార్థం కర్ణాటక రాష్ట్ర హైకోర్టు జడ్జి జస్టిస్ రామచంద్ర కుటుంబ సమేతంగా సోమవారం రాఘవేంద్ర స్వామిని దర్శించుకున్నారు. ఆదివారం రాత్రి మంత్రాలయంలో ఆయన బస చేశారు. సోమవారం గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకుని రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి విశేష పూజలు చేశారు. అనంతరం మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు ఆశీర్వదించారు. వీరి వెంట ఎస్ఐ పరమేష్ నాయక్, మఠం సిబ్బంది బిందు మాధవ్, అనంతస్వామి, ప్రకాశ్ ఆచార్, హరినాథ్ ఆచార్, పవన్‌ఆచార్, వ్యాసరాజార్, జయతీర్థ ఆచార్, రంగస్వామి ఉన్నారు.

## స్వర్ణ రథంపై ప్రహ్లాదరాయలు

### వైభవంగా ద్వాదశి వేడుకలు



స్వర్ణరథంపై ప్రహ్లాదరాయులు ఊరేగింపు

**మంత్రాలయం, సెప్టెంబరు 16:** మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠంలో ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలు స్వర్ణ రథంపై భక్తులకు దర్శనమిచ్చారు. సోమవారం ద్వాదశి శుభదినాన్ని పురస్కరించుకొని మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థుల ఆధ్వర్యంలో బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూర్ణబోధ పూజా మందిరంలో మూలరాములకు, జయరాములు, దిగ్విజయరాములకు కనకాభిషేకం చేశారు. వేద పండితుల మంత్రోచ్చారణలు, మంగళ వాయిద్యాల మధ్య స్వర్ణ రథంపై వజ్రాలు పొదిగిన ప్రహ్లాదరాయలను ఉంచి ఆలయ ప్రాంగణం చుట్టూ ఊరేగించారు. అనంతరం ఊంజలసేవ నిర్వహించారు. భక్తులు గ్రామ దేవత మంచాలమ్మను దర్శించుకొని రాఘవేంద్రస్వామికి విశేష పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. మఠం పీఠాధిపతి భక్తులకు ఫల, పుష్ప, మంత్రాక్షితలు ఇచ్చి ఆశీర్వదించారు.

## పాణ్యం సిమెంటు ఫ్యాక్టరీ కార్మికుల సమ్మె నోటీసు

**బేతంచెర్ల, సెప్టెంబరు 16:** మండలంలోని సిమెంటు నగర్‌లో ఉన్న పాణ్యం సిమెంటు ఫ్యాక్టరీ యజమాన్యానికి కార్మికులు సమ్మె నోటీసు అందజేశారు. కార్మికులు యూనియన్ జనరల్ సెక్రటరీ మోజెస్ ఫ్యాక్టరీ ప్రతినిధికి సోమవారం అందజేశారు. సిమెంటు ఫ్యాక్టరీలో విధులు నిర్వహిస్తున్న కార్మికులకు పాత బకాయిలు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తోందని ఆయన అన్నారు. సోమవారం నుంచి వారం రోజుల్లోగా తమకు రావాల్సిన బకాయిలు చెల్లించకుంటే ఫ్యాక్టరీ గేటు ముందు ధర్నా చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కార్మికులు రామాంజనేయులు, రామసుబ్బయ్య నాయుడు, ఆనీఫ్, శేఖర్, గొల్ల సుబ్బయ్య, శ్రీనివాసులు పాల్గొన్నారు.

## క్రిమినల్ కేసులు నమోదు చేయాలి



బాధితురాలు గోవిందమ్మతో మాట్లాడుతున్న పౌరహక్కుల సంఘం నాయకులు

**ఎమ్మిగనూరు, సెప్టెంబరు16:** పెద్దకడుబూరు మండలం కల్లుకుంట ఘటనలో నిందితులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని పౌరహక్కుల సంఘం, కుల నిర్మూలన పోరాట సమితి నాయకులు కరీంబాషా, అల్లబకాష్, వెంకటేశ్వర్లు, అడ్వకేట్ ఇస్మాయిల్, నటరాజ్, సుబ్బరాయుడులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కల్లుకుంట గ్రామంలో ఈ నెల 12న దళిత గోవిందమ్మపై జరిగిన దాడి ఘటనపై పౌరహక్కుల సంఘం, కుల నిర్మూలన పోరాట సమితి సంయుక్తంగా నిజనిర్ధారణ కమిటీగా ఏర్పడి గ్రామంలో పర్యటించింది. అన్ని కులాల వారిని కలిసి విచారించటంతోపాటు బాధితురాలు గోవిందమ్మతో మాట్లాడి వాస్తవాలు సేకరించారు. గోవిందమ్మపై దాడి చేసేందుకు కుట్ర పన్నిన బీసీ ఆధిపత్య కులాలపై ఎలాంటి కేసు నమోదు చేయకపోవటం పలు అనుమానాలకు తావిస్తోందని అన్నారు. ఇంత దారుణ ఘటన జరిగినప్పటికీ ఆదోని సబ్ కలెక్టర్, కలెక్టర్‌లు గ్రామాన్ని సందర్శించకపోవటం, బాధితురాలిని పరామర్శించకపోవటం బాధాకరమన్నారు. మొదట్లోనే వారిపై ఎస్సీ, ఎస్టీ, పీఓఏ కేసులు పెట్టి ఉంటే పరిస్థితి ఇంతవరకు వచ్చేది కాదని అన్నారు. ఈ నిజనిర్ధారణ కమిటీలో హనుమంతు, ఉరుకుందు, సంజీవ్‌లు ఉన్నారు.


## ఈఎన్‌టీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా జయప్రకాష్ రెడ్డి



డా.బి.జయ ప్రకాష్ రెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు

**కర్నూలు(హాస్పిటల్), సెప్టెంబరు 16:** చెవి, ముక్కు, గొంతు (ఈఎన్‌టీ) వైద్యుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా కర్నూలుకు చెందిన సీనియర్ ఈఎన్‌టీ వైద్య నిపుణుడు డా.బిజయప్రకాష్ రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ నెల 13, 14, 15 తేదీల్లో రాష్ట్రంలోని భీమవరంలో రాష్ట్ర 42వ ఈఎన్‌టీ వైద్యుల మహాసభ జరిగింది. ఈ సదస్సులో గత 30 ఏళ్లుగా రోగులకు సేవలందిస్తూ ఆధునిక పరికరాలతో క్లిష్టతరమైన శస్త్ర చికిత్స చేస్తూ తాను నేర్చుకున్న నైపుణ్యాన్ని నూతన వైద్యులకు శిక్షణ ఇస్తున్న డా.జయప్రకాష్ రెడ్డి సేవలు గుర్తించి రాష్ట్ర అధ్యక్షుడిగా సంఘం నియమించింది. డా.జయప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి లో ఈఎన్‌టీ వైద్య రంగం మెరుగుదలకు కృషి చేస్తున్నారు. అనంతరం చెవిలో చీము కారే రోగులపై అత్యాధునిక పరికరాలతో ఆపరేషన్ చేసిన ప్రదర్శనకు డా.శివరామకృష్ణ స్మారక గోల్డ్ మెడల్ ఆయనకు లభించింది. అలాగే చిన్న పిల్లల్లో వచ్చే ట్రాన్సిల్ శస్త్రచికిత్స ప్రదర్శనకు రజక పతకం లభించినట్లు ఆయన తెలిపారు.

## కడప జోనల్ క్రికెట్ అకాడమీ చైర్మన్‌గా గోవిందరెడ్డి



కేజీ గోవిందరెడ్డి

**కర్నూలు(హాస్పిటల్), సెప్టెంబరు 16:** కడప జోనల్ క్రికెట్ అకాడమీ చైర్మన్‌గా కర్నూలు జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షునిగా ఉన్న డా.కేజీ గోవిందరెడ్డిని నియమిస్తూ ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు కేశినేని చిన్ని ఉత్తర్వులు జారీ చేశారు. గత 25 ఏళ్లుగా కర్నూలు జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడిగా గోవిందరెడ్డి పని చేస్తున్నారు. ఆయన సేవలను ఆంధ్రక్రికెట్ అసోసియేషన్ గుర్తించి కడప జోనల్ (కర్నూలు, అనంతపురం, చిత్తూరు, నెల్లూరు, కడప) క్రికెట్ అకాడమీ చైర్మన్‌గా నియమించింది. కడప జోనల్ క్రికెట్ చైర్మన్‌గా ఎన్నికైన గోవిందరెడ్డికి జిల్లా క్రికెట్ అసోసియేషన్, జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ నాయకులు అభినందనలు తెలిపారు.

# 20 గంటల పాటు నిమజ్జనం

### వీహెచ్‌పీ కార్యాలయ గణపతికి వీడ్కోలుతో ముగిసిన ఉత్సవాలు







**కర్నూలు(కల్చరల్), సెప్టెంబరు 16:** నగరంలో వినాయకుడి నిమజ్జనోత్సవం 20 గంటలపాటు సాగింది. వీహెచ్‌పీ కార్యాలయ గణపతికి వీడ్కోలుతో కార్యక్రమం ముగిసింది. తొమ్మిది రోజులపాటు కన్నుల పండువగా సాగిన గణేశ్ నవరాత్రి ఉత్సవాలు సోమవారం ఉదయం 10 గంటలకు చివరి విగ్రహం నిమజ్జనంతో ముగిశాయి. నగర నడిబొడ్డున గల కేసీ కెనాల్ వినాయక ఘాట్‌లో సోమవారం ఉదయం 10 గంటలకు రెవెన్యూ కాలనీలోగల విశ్వ హిందూ పరిషత్ కార్యాలయ ఆవరణలోని భరతమాత గుడిలోని వినాయకుడి విగ్రహాన్ని చివరగా ఉత్సవ ప్రతినిధులు నిమజ్జనం చేశారు. నగరంలోని వివిధ ప్రాంతాల్లో గణేశ్ మండపాల్లో రెండు వేలకు పైగా విగ్రహాలు నెలకొల్పగా వాటిని నిర్వాహకులు ఆదివారం ఆలస్యంగా తరలించారు. వినాయక ఘాట్‌లోనూ ఆదివారం మధ్యాహ్నం 2 గంటలకు జరగాల్సిన నిమజ్జనం ఆలస్యంగానే మొదలైంది. దీంతో సోమవారం ఉదయం వరకు భారీ విగ్రహాలను కేసీలో నిమజ్జనం చేస్తూనే ఉన్నారు. కాగా సోమవారం ఉదయం 10 గంటల సమయంలో చివరి విగ్రహాన్ని నిమజ్జనం చేసి ఉత్సవం పూర్తయినట్లు గణేశ్ మహోత్సవ కేంద్ర సమితి ప్రతినిధులు ప్రకటించారు.

# సైబర్ నేరగాళ్ల బురిడీ

**వ్యాపారుల నుంచి రూ.కోటిపైనే వసూలు**



**ఆదోని, సెప్టెంబరు 16 :** సైబర్ నేరగాళ్లు వ్యాపారులను బురిడీ కొట్టించారు. ఇన్‌కమ్ ట్యాక్స్ అధికారులమని చెప్పి వ్యాపారుల నుంచి రూ.కోటిపైనే వసూలు చేశారు. వివరాలు ఇలా.. ఆదోని పట్టణంలోని వ్యాపారులకు కొంతమంది వ్యక్తులు ఇన్‌కమ్ టాక్స్ అధికారులమంటూ ఫోన్ చేశారు. 'మీ షాప్ తనిఖీ కోసం మా ఉన్నత అధికారి వస్తున్నారు. మీ ఫైల్స్ అన్నీ సిద్ధం చేసుకోండి.. లేకుంటే రూ.లక్షల్లో ఫైన్ పడుతుంది' అని బెదిరింపులకు గురి చేశారు. అనంతరం తనిఖీలకు రాకూడదంటే పార్మాలిటీస్ చూసుకుంటే మంచిదంటూ నమ్మబలికారు. దీంతో ఇన్‌కమ్ ట్యాక్స్ అధికారులు కదా.. ఎందుకొచ్చిందిలే అని కొంతమంది వ్యాపారులు సదరు వ్యక్తులు చెప్పినట్లు చేస్తామని చెప్పారు. ఇదే అదునుగా భావించిన సైబర్ నేరగాళ్లు వెంటనే వ్యాపారులకు ఒక ఫోన్ నెంబర్ ఇచ్చి డబ్బు పంపించాలని డిమాండ్ చేశారు. దీంతో సంబంధిత వ్యాపారి వెనువెంటనే రూ.20 వేలు ఫోన్ పే చేశాడు. ఇలా ఒకరికి తెలియకుండా మరొకరితో ఇన్‌కమ్ ట్యాక్స్ అధికారులమంటూ రూ.కోటిపైనే వసూళ్లకు పాల్పడ్డారు. చివరకు ఓ బెల్లం వ్యాపారి వద్ద వీరి ఆటకు అడ్డుకట్ట పడింది. సదరు బెల్లం వ్యాపారికి ఫోన్ చేసిన యథావిధిగా బెదిరింపులకు దిగారు. అయితే ఇన్‌కమ్ ట్యాక్స్ వివరాల గురించి పూర్తి స్థాయిలో ముందుగానే తెలుసుకున్న సదరు వ్యాపారి సైబర్ నేరగాళ్లని గుర్తించి 'మీ మాయమాటలు నా దగ్గర కాదని.. ఎవరిని పంపిస్తారో పంచుకోండని' ఫోన్ పెట్టేశాడు.

## విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

**గోనెగండ్ల, సెప్టెంబరు 16:** విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మండల పరిధిలోని బైలుప్పల గ్రామంలో ఆదివారం అర్ధరాత్రి చోటు చేసుకున్నది. గ్రామానికి చెందిన చాకలి తిక్కన్న (35) తన ఇంటి దగ్గర ఉన్న మేకల పాకలో లైట్ వేసేందుకు వెళ్లాడు. ఈ క్రమంలోనే విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య

**కోసిగి, సెప్టెంబరు 16:** రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన కోసిగి మండలంలో సోమవారం మధ్యాహ్నం చోటు చేసుకున్నది. రైల్వే పోలీసు సాయి సర్వేశ్వరరావు వివరాల ప్రకారం.. కోసిగి ఐరంగల్, ఆర్‌ఎస్‌ఎస్‌ల మధ్య 523/4042 నెంబరు సమీపంలో కోసిగి 2వ వార్డు బుల్లొల్లి కాలనీకి చెందిన బలకుంద బంగారు కోసిగయ్య (52) గూడ్సు రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆదోని ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య మాదేవి, నలుగురు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు.

## కారు బోల్తా.. ముగ్గురికి గాయాలు

**ఆస్పరి, సెప్టెంబరు 16 :** కారు బోల్తా పడి ముగ్గురికి గాయాలయ్యాయి. బెంగళూరుకు చెందిన ఒకే కుటుంబ సభ్యులు మంత్రాలయం రాఘవేంద్ర స్వామిని దర్శించుకొని తిరుగు ప్రయాణమయ్యారు. మండలంలోని బిలేకల్ గ్రామ సమీపంలోకి రాగానే కారు సోమవారం మధ్యాహ్నం బోల్తా పడింది. దీంతో కారులో ప్రయాణిస్తున్న ముగ్గురికి గాయాలయ్యాయి. స్థానిక రైతులు చూసి క్షతగాత్రులను ఆస్పరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు.

## గ్రావెల్ తవ్వకాలపై విచారణ

**కర్నూలు(అర్బన్), సెప్టెంబరు 16:** గ్రావెల్ అక్రమ తవ్వకాలపై విచారణ చేసి చర్యలు తీసుకుంటామని గనుల శాఖ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్ అన్నారు. సోమవారం కలెక్టర్‌కు అందిన ఫిర్యాదు మేరకు హాలహర్వి మండలం హర్దగేరి వద్ద సర్వే నెంబర్ 104/సీ అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు జరిగినట్లు నిర్ధారించామని తెలిపారు. కస్తూర్బా స్కూల్ కోసం గ్రావెల్‌ను తరలించారని, మొత్తం 400 క్యూబిక్ మీటర్ల గ్రావెల్ తరలించినట్లు తేలిందని వివరించారు. రాయల్టీ ఇన్‌స్పెక్టర్ మురహరి, మధు, సిబ్బంది, వీఆర్వోలు పాల్గొన్నారు.

# ఎంఈవో-2 పోస్టులు రద్దు చేయకండి

**కర్నూలు(ఎడ్యుకేషన్), సెప్టెంబరు 16:** మండల విద్యాశాఖాధికారి-2 పోస్టులు రద్దు చేసి కాంప్లెక్స్ హెడ్‌మాస్టర్‌కు అధికారాలు బదలాయించాలన్న ఆలోచనను ప్రభుత్వం విరమించుకోవాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎన్‌వీ కృష్ణారెడ్డి, ఎస్.రామకృష్ణ సోమవారం ఓ ప్రకటనలో కోరారు. ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాఠశాల విధులతోనే సతమతమవుతున్నారని, మండల పరిషత్ పాఠశాలలపై అధికారాలు కల్పిస్తే రెండింటికి న్యాయం చేయలేరని, విద్యావ్యవస్థ పూర్తిగా దెబ్బతింటుందని పేర్కొన్నారు. అదేవిధంగా విద్యాశాఖలో దాదాపు 95 శాతం ఉన్న పంచాయతీరాజ్ ఉపాధ్యాయులకు న్యాయం చేయాలన్న లక్ష్యంతో ఏర్పడిన ఎంఈవో-2 పోస్టును రద్దు చేస్తే ఉపాధ్యాయులకు తీవ్రమైన నష్టం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వం ఎంఈవో-2 రద్దు ఆలోచనను విరమించుకుని అత్యధిక శాతం ఉన్న పంచాయతీరాజ్ ఉపాధ్యాయుల మనోభావాలకు అనుగుణంగా తగిన నిర్ణయం తీసుకోవాలని కోరారు.

### మండల విద్యాధికారి వ్యవస్థను కొనసాగించాలి : డీటీఎఫ్

నూతన జాతీయ విద్యావిధానం-2020లో అమలులో భాగంగా పాఠశాల సముదాయం బలోపేతం పేరిట మండల విద్యాధికారాలను కత్తెరించి స్కూల్ కాంప్లెక్స్ హెడ్ మాస్టార్లకు, క్లస్టర్లకు సెకండరీ గ్రేడ్ టీచర్లను నియమించడాన్ని డీటీఎఫ్ తీవ్రంగా ఖండిస్తుందని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గట్టు తిమ్మప్ప, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రత్నం ఏసేపు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జీవో 117 వలన ప్రాథమిక విద్య దెబ్బతింటుందన్నారు. మండలంలో పాఠశాల విద్యను అజామాయిషీ చేస్తున్న మండల విద్యాశాఖ అధికారాలను పూర్తిగా తొలగించడానికి కుట్రలో భాగమే స్కూల్ కాంప్లెక్స్ కుదింపు చర్యలు ప్రభుత్వం చేపడుతుందన్నారు. దీనిని వెంటనే విరమించుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. అనంతరం విరాళాల సేకరణ చేపట్టారు. కార్యక్రమంలో డీటీఎఫ్ నాయకులు బజారప్ప, రాఘవేంద్రరావు, సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## ఇంట్లో చోరీ

**నంద్యాల క్రైం, సెప్టెంబరు 16:** నంద్యాల వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని సంగపేటలో ఆదివారం రాత్రి ఓ ఇంట్లో చోరీ జరిగింది. చాపిరేవుల హైస్కూల్‌లో ఇంగ్లీష్ టీచర్‌గా విధులు నిర్వర్తిస్తున్న ప్రమీళ రెండ్రోజుల క్రితం తన సోదరికి అనారోగ్యంగా ఉండటంతో పాణ్యం వెళ్లారు. ఆదివారం అర్ధరాత్రి దొంగలు ఇంటి తాళాలు పగులగొట్టి బీరువాలో ఉన్న 9తులాల బంగారు నగలు, అర కేజీ వెండి, రూ.20వేల నగదు అపహరించుకు పోయారు. సోమవారం ఇంటికి వచ్చిన ప్రమీళ ఇంట్లో చోరీ జరిగినట్లు నిర్ధారించుకొని వన్‌టౌన్ పోలీసులకు సమాచారం అందించారు. చోరీ జరిగిన తీరును పోలీసులు పరిశీలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సుధాకర్‌రెడ్డి తెలిపారు.

## చికిత్స పొందుతూ నర్సింగ్ విద్యార్థిని మృతి

**బేతంచెర్ల, సెప్టెంబరు 16:** మండలంలోని సిమెంటు నగర్‌కు చెందిన నర్సింగ్ విద్యార్థిని షేక్ రుక్సానా (19) చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. సిమెంటు నగర్‌కు చెందిన షేక్ మహబూబ్ బాషా, ఫాతిమా దంపతుల కుమార్తె షేక్ రుక్సానా కడప జిల్లా అయ్యవారిరెడ్డి నర్సింగ్ కాలేజీలో మొదటి సంవత్సరం నర్సింగ్ కోర్సు చేస్తోంది. రుక్సానాను కళాశాలలో ఫోన్ మాట్లాడవద్దని యాజమాన్యం మందలించడంతోపాటు నెల రోజులపాటు సస్పెండ్ చేయడంతో ఇంటికి వచ్చింది. మనస్తాపానికి గురైన రుక్సానా ఈ నెల 13న ఇంట్లో ఎవరూ లేని సమయంలో విషద్రావణం తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ లింగమయ్య తెలిపారు.

### డోన్‌లో ట్రాఫిక్ అవుట్‌పోస్ట్

## పోలీస్‌స్టేషన్ ప్రారంభం



ఎస్పీ, ఎమ్మెల్యేలకు బొకేలు అందజేస్తున్న పోలీస్ అధికారులు

**నంద్యాల క్రైం/ డోన్ రూరల్, సెప్టెంబరు 16 :** నంద్యాల జిల్లా డోన్ పట్టణంలో ట్రాఫిక్ అవుట్‌పోస్ట్ పోలీస్‌స్టేషన్‌ను ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా, ఎమ్మెల్యే కోట్ల జయసూర్య ప్రకాష్‌రెడ్డి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా మాట్లాడుతూ డోన్ పట్టణంలో ట్రాఫిక్ నిబంధనలు అమల్లో ఉంటాయన్నారు. రూల్స్ పాటించనివారిపై, మద్యం తాగి వాహనాలు నడిపేవారిపై చట్టపర మైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో డోన్ డీఎస్పీ శ్రీనివాసులు, డోన్ టౌన్ సీఐ ఇంతియాజ్ బాష, రూరల్ సీఐ సీఎం రాకేష్, ప్యాపిలి సీఐ వెంకటరామిరెడ్డి, ఎస్సైలు, పోలీస్‌స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## క్షుద్రపూజల కలకలం

**కోవెలకుంట్ల, సెప్టెంబరు 16 :** పట్టణంలోని సబ్‌రిజిస్ట్రారు కార్యాలయం పక్కనే కుందూనది ఒడ్డున క్షుద్ర పూజల కలకలం రేగింది. సోమవారం కుందూ నది వద్ద క్షుద్ర పూజలు చేసిన ఆనవాళ్లు కనిపించాయి. శనివారం, ఆదివారాలు సెలవు దినాలు కావడం, అటు వైపుగా ఎవరూ రాకపోవడంతో ఈ కార్యక్రమం జరిగి ఉండొచ్చని పలువురు పేర్కొంటున్నారు. క్షుద్రపూజల కోసం చేశారా, లేక దినకర్మ కోసం చేశారా అన్నది పోలీసుల విచారణలో తేలాల్సి ఉంది.

## నేడు నులి పురుగుల మందుల పంపిణీ

**కర్నూలు(హాస్పిటల్), సెప్టెంబరు 16:** జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమం కింద మంగళవారం జిల్లా వ్యాప్తంగా ఆల్బెండజోల్ మాత్రలను మింగించనున్నట్లు డీఎంహెచ్‌వో డా.ఎల్.భాస్కర్ ఓ ప్రకటనలో తెలిపారు. 1 నుంచి 5 సంవత్సరాల పిల్లలకు, బడి బయట పిల్లలకు, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, జూనియర్ కాలేజీలు, పాలిటెక్నిక్ కళాశాలలు, ఐటీఐల్లో మంగళవారం మధ్యాహ్నం భోజనం అనంతరం ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఏదైనా కారణం చేత మాత్రలు అందని పిల్లలకు ఈ నెల 25న పంపిణీ చేస్తామని పేర్కొన్నారు. పిల్లల్లో నులిపురుగులను నివారించడానికి, తద్వారా రక్తహీనతకు గురి కాకుండా ఈ మాత్రలు తోడ్పడతాయని తెలిపారు.

## పెద్దాసుపత్రిలో 61 మంది క్షతగాత్రులకు చికిత్స

**కర్నూలు(హాస్పిటల్), సెప్టెంబరు 16:** గణేశ్ నిమజ్జనం సందర్భంగా ఆదివారం రాత్రి నుంచి గాయపడిన 61 మంది క్షతగాత్రులకు చికిత్స అందించినట్లు కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.సి.ప్రభాకర్ రెడ్డి తెలిపారు. గణేశ్ నిమజ్జనం రోజున ఆసుపత్రిలో ప్రత్యేకంగా ర్యాపిడ్ రెస్పాన్స్ టీమ్‌ను ఏర్పాటు చేయడం వల్ల క్యాజువాల్టీలో మంచి ఫలితాలు వచ్చాయన్నారు. గాయపడిన వారిలో చిన్న చిన్న గాయాలు వారే అధికంగా ఉన్నారని, కొందరికి ఫ్యాక్చర్లు కూడా అయ్యాయని తెలిపారు. వీరందరికీ క్యాజువాల్టీలోనే సత్వర వైద్యం అందించామన్నారు. ఆదివారం మధ్యాహ్నం రాత్రి డ్యూటీలో వైద్యులు, నర్సు లు బాగా పని చేశారని, అందు కోసం ప్రభుత్వ వై ద్యశాలలో ఉన్న నర్సులు, ప్రైవేటు వైద్యకళాశాలల్లో ఉన్న నర్సింగ్ విద్యార్థులు కూడా పని చేశారని ప్రశంసించారు. ఆసుపత్రిలో మొట్ట మొదటిసారిగా గణేశ్ నిమజ్జనం సందర్భంగా ఏర్పాటు చేసి ర్యాపిడ్‌రెస్పాన్స్ టీమ్ సభ్యులు నర్సింగ్ సూపరింటెండెంట్ ఎస్‌పీ సావిత్రీబాయికి ప్రత్యేకంగా ఆయన ధన్యవాదాలు తెలిపారు.

# శిథిల వంతెనలు.. గాల్లో ప్రాణాలు

- భద్రతను గాలికొదిలేసిన ప్రభుత్వం
- మనుకుందు వాగు వంతెన ఎత్తు అంతేనా..?
- గ్రామస్థుల విన్నపాన్ని పట్టించుకోని అధికారులు
- మలుపుల వద్ద కనిపించని సూచికలు
- ప్రమాదాలకు గురవుతున్న వాహనదారులు

**పాణ్యం, సెప్టెంబరు 16:** మండలంలోని శిథిల వంతెనలు అమాయకుల ప్రాణాలు హరిస్తున్నాయి. దెబ్బతిన్న వంతెనల వద్ద ప్రమాద సూచికలు లేకపోవడంతో వాహనదారులు అప్రమత్తం కాలేకపోతున్నారు. ఫలితంగా ప్రమాదాల బారిన పడుతున్నారు. వంతెనల మరమ్మతులకు ప్రతియేటా ప్రతిపాదనలు తయారు చేస్తున్నా నిధులు మంజూరు కావడం లేదు. ఫలితంగా మరమ్మతులకు నోచుకోవడం లేదు. బనగానపల్లె పాణ్యం రహదారిలోని కొనిదేడు సమీపంలో గల వద్దెల వాగు వంతెన దశాబ్దాల నుంచి మరమ్మతుకు నోచుకోవడం లేదు. ఇక్కడ రహదారి మలుపు ఉండి ప్రమాదకరంగా మారింది. ఈ నెల 8వ తేదీన వంతెనపై రెండు లారీలు ఢీకొని దాదాపు ఐదు గంటల పాటు వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. తమ్మరాజుపల్లె సమీపంలోని అడ్డవాగు వంతెనను నాలుగు రోడ్ల నిర్మాణంలో వెడల్పు చేయకపోగా శిథిలమైన వంతెనను పైపై మెరుగులతో కప్పేశారు. గగ్గటూరు సమీపంలోని మునుకుందు వాగు వంతెన ఎత్తులేకపోవడంతో నిత్యం రహదారిపై నీరు ప్రవహిస్తూ ఉంటుంది. వాగు ప్రవాహం గమనించని ప్రయాణికులు ప్రమాదాల బారిన పడుతున్నారు.

### ప్రధాన సంఘటనలు

తమ్మరాజుపల్లె వద్ద అడ్డవాగులో 2007 ఆగస్టు 5న మామిడి కాయల లోడుతో వెళ్తున్న లారీ వాగులో పడి శిరివెళ్లకు చెందిన ఆరుగురు మృత్యువాత పడ్డారు. 2011 ఏప్రిల్ 17న ఇదే వాగులో లారీ బోల్తా పడిన సంఘటనలో గోనెగండ్ల, సి.బెళగల్ మండలాలకు చెందిన ముగ్గురు వలస కూలీలు మృతి చెందారు. అలాగే హైదరాబాదుకు చెందిన కానిస్టేబుల్ మోటారు సైకిల్‌పై వెళ్తూ వాగులో పడి మరణించాడు. 2022 జూన్ 16న అడ్డవాగు రక్షణ గోడలను కారు ఢీకొన్న ప్రమాదంలో అన్నమయ్య జిల్లా చిట్వేలు మండలం రాచమల్ల గ్రామానికి చెందిన తండ్రీ కొడుకులు మృతి చెందారు. బనగానపల్లె-పాణ్యం రహదారిలోని వద్దెల వాగు వంతెన వద్ద 2021లో పాణ్యంకు చెందిన ఓ యువకుడు మృతి చెందాడు. మరో ప్రమాదంలో కొనిదేడు గ్రామానికి చెందిన వ్యక్తి మృతి చెందాడు. ఈ నెల 13వ తేదీన వంతెనపై రెండు లారీలు ఢీకొని ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడగా ఐదు గంటల పాటు దూరప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు తీవ్ర అవస్థలు ఎదుర్కొన్నారు. గత నెల 7వ తేదీన గగ్గటూరు సమీపంలోని మునుకుందు వాగులో కారు పడి కర్నూలుకు చెందిన కమ్మరి దినేష్ ఆచారి అనే సాఫ్ట్‌వేర్ యువ ఇంజనీరు మృతి చెందాడు. మరో ముగ్గురు ఇంజనీర్లను సమీప గ్రామస్థులు కాపాడారు. వంతెన ఎత్తు పెంచాలని కోరుతున్నా ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.


శిథిలమైన తమ్మరాజుపల్లె అడ్డవాగు వంతెన


ప్రమాదకరంగా ఉన్న తొగర్చేడు వంతెన

### ప్రమాదాలకు కారణాలివే..

నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్మించిన నాలుగు రోడ్ల నిర్మాణంలో భాగంగా తమ్మరాజుపల్లె వద్ద అడ్డవాగుపై కొత్తగా వంతెన నిర్మించారు. శిథిలావస్థలోని పాత వంతెనకు తాత్కాలికంగా సిమెంటు పూతపూసి అలాగే వదిలేశారు. దీంతో రహదారి వెడల్పు చేసినా వంతెనను మాత్రం ఇరుకుగానే ఉంచారు. నంద్యాల వైపు నుంచి వెళ్లే వాహనాలు ఇరుకు వంతెన దగ్గరకు వచ్చే వరకు కనబడకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రమాదాలకు కారణాలు తెలిసినా వాటిని నివారించడంలో సంబంధిత అధికారులు నిర్లక్ష్య ధోరణి వహిస్తున్నారు. పాణ్యం మండలంలో రోడ్డు ప్రమాదాల సంఖ్య తగ్గుముఖం పట్టినా అడ్డవాగు వద్ద మాత్రం అదే పరిస్థితి కనిపిస్తోంది. వంతెనకు ఇరుపక్కల గల రక్షణ గోడలు, కింది పిల్లర్లు శిథిలావస్థకు చేరుకున్నాయి. కొనిదేడు సమీపంలోని వద్దెల వాగు వంతెనకు ఇరువైపులా రహదారి మలుపులు ఉండడంతోపాటు ప్రమాద సూచికలు లేకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. వంతెనను వెడల్పు చేసి మలుపు తగ్గించాలని ప్రయాణికులు కోరుతున్నా ఎటువంటి పనులు చేపట్టడం లేదు. గగ్గటూరు సమీపంలోని మనుకుందు వాగు వంతెన ఎత్తు పెంచాలని 20 ఏళ్లుగా గ్రామస్థులు కోరుతున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి శిథిలావస్థకు చేరిన వంతెనలకు మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.

నంద్యాల, బనగానపల్లె, గోస్పాడు మండలాలను కలిపే తొగర్చేడు, మద్దూరు కుందూ వంతెనలు శిథిలావస్థకు చేరాయి. గత ఏడాది ఈ వంతెనల మరమ్మతులకు ప్రభుత్వంకు రూ. 6 కోట్లతో ప్రతిపాదనలు పంపినా నిధులు మంజూరు కాకపోవడంతో పనులు ప్రారంభం కాలేదు. వరదల సమయంలో ఈ తీర ప్రాంతాల గ్రామాల ప్రజలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

## వైభవంగా పల్లకీ సేవ


మహానందిలో పల్లకీ సేవ నిర్వహిస్తున్న వేదపండితులు

**మహానంది, సెప్టెంబరు 16:** మహానంది క్షేత్రంలో సోమవారం రాత్రి ఘనంగా పల్లకీ సేవను ఆలయ వేదపండితులు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని కల్యాణ మంటపంలో మహానందీశ్వరుడు, కామేశ్వరీదేవి అమ్మవార్ల ఉత్సవ మూర్తుల విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించిన పల్లకిపై ఆశీనులుజేచారు. వేదమంత్రాలతో పూజలను జరిపారు. ఆలయ మెదటి ప్రాకారంలో భక్తుల శివనామస్మరణ మధ్య పల్లకీ ఉత్సవాన్ని నిర్వహించారు. అర్చకులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో మిలాద్ ఉన్ నబీ


వెలుగోడులో కేశాన్ని దర్శించుకుంటున్న ముస్లింలు

**వెలుగోడు, సెప్టెంబరు 16:** వెలుగోడు పట్టణంలో మిలాద్ ఉన్ నబీ వేడుకలను ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. సోమవారం ముస్లింలు అసార్ ఏ షరీఫ్ ప్రార్థన మందిరానికి వెళ్లి ప్రార్థనలు చేశారు. నెల వంక దర్శనం నుంచి 12 రోజుల పాటు నాతే షరీఫ్ యొక్క వచనాలు, గుణములను భక్తులకు వివరించారు. భక్తులకు స్వీట్లు, పాలు, పండ్లు, బెడ్లు పంపిణీ చేశారు. వేడుకల్లో వజీర్, ఖాజామొహిద్దీన్, ఇనయతుల్లా, బురానుద్దీన్, రఫీ పాల్గొన్నారు.

## 'ఫిరోజ్‌పై దాడి హేయమైన చర్య'


మాట్లాడుతున్న మాదిగ అడ్వకేట్స్ అసోసియేషన్ నాయకుడు

**నంద్యాల రూరల్, సెప్టెంబరు 16:** మంత్రి ఎన్ఎండీ ఫరూక్ తనయుడు, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్‌పై దాడి హేయమైన చర్య అని మాదిగ అడ్వకేట్స్ అసోసియేషన్ నాయకులు అన్నారు. పట్టణంలోని అడ్వకేట్ వెంకటేశ్వరుడు కార్యాలయంలో సోమవారం సమావేశమైన మాదిగ అడ్వకేట్స్ అసోసియేషన్ కార్యవర్గం ఈ మేరకు దాడిని ఖండిస్తూ ఏకగ్రీవ తీర్మానం చేసింది. నంద్యాల నియోజకవర్గ ప్రజల అభివృద్ధికి నిరంతరం పాటుపడుతున్న మంత్రి ఫరూక్, ఆయన కుమారులకు సమస్యలను సావధానంగా తెలిపి వారి నుంచి తగిన సాయం పొందాలే కానీ ఇలా దౌర్జన్యానికి పాల్పడటం అప్రజాస్వామిక చర్య అన్నారు. ఇలాంటి చర్యలను మాదిగ అడ్వకేట్స్ అసోసియేషన్ తీవ్రంగా ఖండిస్తుందని, ఎన్ఎండీ ఫిరోజ్‌కు అసోసియేషన్ పూర్తి బాసటగా నిలుస్తుందని అన్నారు. సమావేశంలో అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు శ్రీనివాసులు, అధ్యక్షుడు ఎం.వెంకటేశ్వరుడు, ఉపాధ్యక్షుడు జీవన్‌రాజ్, ప్రధాన కార్యదర్శి పుల్లన్న, సహాయ కార్యదర్శి వనం శ్రీనివాసులు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## ఓజోన్ పొరను కాపాడుకుందాం



సమావేశంలో మాట్లాడుతున్న స్పెషల్ ఆఫీసర్ దాక్షాయిణి

**బండిఆత్మకూరు, సెప్టెంబరు 16:** చేయిచేయి కలిపి ప్రతి ఒక్కరం ఓజోన్ పొరను కాపాడుకుందామని రాష్ట్ర శాస్త్ర, సాంకేతిక సలహా మండలి జిల్లా కో ఆర్డినేటర్ సుబ్బారెడ్డి, స్పెషల్ ఆఫీసర్ దాక్షాయిణి సూచించారు. బండిఆత్మకూరులోని కేజీబీవీలో ప్రపంచ ఓజోన్ పొర పరిరక్షణ దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా వివిధ రకాల కాలుష్య నివారణలపై విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ, డ్రాయింగ్ పోటీలలో గెలుపొందిన విజేతలకు బహుమతులను ప్రధానం చేశారు. రసాయన, వాహన, ఎలక్ట్రానిక్ కాలుష్య నివారణ చర్యలు జరిగితేనే ఓజోన్ పొరను రక్షించుకోగలమని ఎన్‌జీసీ కో ఆర్డినేటర్ చంద్రశేఖర్‌రెడ్డి, దీక్ష కో ఆర్డినేటర్ నాగేంద్రకుమార్ అన్నారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఎంబీబీఎస్‌లో సీటు సాధించిన విద్యార్థులు


గణేశ్‌మధు పవన్


తన్మయి

**పాములపాడు, సెప్టెంబరు 16:** పాములపాడు గ్రామానికి చెందిన ప్రైవేటు టీచర్ శ్రీనివాసులు కుమార్తె తన్మయి నీట్‌లో 665 మార్కులు సాధించింది. ఇదే గ్రామానికి చెందిన సాయికృష్ణ కుమారుడు గణేశ్ మధుపవన్ నీట్‌లో 624 మార్కులు సాధించాడు. వీరిద్దరికీ మొదటి విడతలో కర్నూలులోని ప్రభుత్వ మెడికల్ కాలేజీలో సీటు వచ్చింది. గణేశ్ మధుపవన్‌ను జనసేన నాయకులు రాము, ప్రజా సంఘాల నాయకులు సామన్న, షర్ఫుద్దీన్, నాగరాజు, అంకన్న, షేక్షా వలి అబిమానులు శాలువాలు, పూలమాలలతో సత్కరించారు.

## నేటి నుంచి 'స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాలు'

**నందికొట్కూరు, సెప్టెంబరు 16:** నందికొట్కూరు పట్టణంలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాలు మంగళవారం ప్రారంభమై అక్టోబరు 1వ తేదీ వరకు నిర్వహించడం జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ బేబి ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమాల్లో భాగంగా మంగళవారం ఉదయం 8 గంటలకు మున్సిపల్ కార్యాలయం నుంచి పటేల్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించి పటేల్ సెంటర్లో మానవహారం నిర్వహించి ప్రతిజ్ఞ చేస్తామన్నారు. కావున పట్టణ ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని ఆమె పిలుపునిచ్చారు.



## వరద బాధితులకు విరాళాలు


విరాళాన్ని ఎమ్మెల్యేకు అందజేస్తున్న మాధవరం నాయకులు


ఎమ్మెల్యేకు విరాళాలు అందజేస్తున్న శింగవరం నాయకులు


విరాళం అందిస్తున్న పువ్వాడి భాస్కర్

**బండిఆత్మకూరు, సెప్టెంబరు 16:** విజయవాడ వరద బాధితుల సహాయార్థం మండలంలోని శింగవరం టీడీపీ నాయకులు ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డికి రూ.60వేల నగదు అందజేశారు. సోమవారం వారు గ్రామంలో సేకరించిన నగదును విజయవాడ వరద బాధితుల సహాయార్థం అందజేశారు. అలాగే బండిఆత్మకూరు టీడీపీ నాయకులు రూ. 1,05,000 నగదును అందజేశారు. కార్యక్రమాల్లో సుబ్బారెడ్డి, జాకీర్, నందయ్య, రామసుబ్బయ్య, నబీరసూల్, ధనుంజయగౌడ్, మణికంఠ, నాగేంద్ర, రంగస్వామి, నారాయణ పాల్గొన్నారు.

**మిడుతూరు:** మిడుతూరు, సుంకేసుల, వీపనగండ్ల, నాగలూటి గ్రామాల్లోని ఏబీఎం చర్చిల ద్వారా సంఘకాపరి కె.ఇమ్మానియేల్ నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య ఆధ్వర్యంలో రూ.1.5 లక్షలు విరాళాలు సేకరించారు. ఈ నగదుతో వరద బాధితులకు నిత్యావసర సరుకులు బియ్యం, కంది పప్పు, మంచినూనె, కూరగాయల కిట్లను 400 కుటుంబాలకు మిడుతూరు ఏబీఎం చర్చి దగ్గర నుంచి విజయవాడకు వాహనం ద్వార తరలించి వరద బాధితులకు పంపిణీ చేసినట్లు సంఘ పెద్దలు తెలిపారు. సంఘ పెద్దలు పాల్గొన్నారు.

**ఆత్మకూరు రూరల్:** విజయవాడ నగరంలో సంభవించిన వరదలతో సర్వం కోల్పోయిన బాధితులను ఆదుకునేందుకు శ్రీశైలం నియోజకవర్గం ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు రావాలని ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి ఇచ్చిన పిలుపునకు విశేషమైన స్పందన లభిస్తోంది. ఇందులో భాగంగానే సోమవారం ఆర్యవైశ్య యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు పువ్వాడి భాస్కర్ రూ.లక్ష, గౌరి శంకర్ గ్యాస్ ఏజెన్సీ తరఫున రూ.25 వేలు, మహానంది మండల పొదుపు సంఘం తరఫున 3,42,550, మహానంది ఎంపీపీ బుడ్డారెడ్డి యశస్విని రూ.50 వేలు, బోడమ్మనూరు వెంకటరెడ్డి రూ.2 లక్షలు, గాయత్రి విశ్వకర్మ సేవాసంఘం ఆత్మకూరు తరఫున రూ.10 వేలు, హెచ్‌పీ పెట్రోల్ బంక్ కలీముల్లా రూ.20 వేలు, విశ్రాంత ఈఈ సుధాకరరెడ్డి రూ.25 వేలు, నల్లకాలువ సర్పంచ్ వెంకటరమణ 10,101 వ్యక్తిగత విరాళాలతో పాటు వివిధ గ్రామాలు, సంఘాల తరఫున ఆత్మకూరులోని టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డికి అందజేశారు.

**వెలుగోడు:** మండలంలోని మాధవరం టీడీపీ నాయకులు రూ1,78,000 నగదు సహాయాన్ని ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డికి అందజేశారు. ఈ సహాయం విజయవాడ వరద బాధితుల సహాయార్థం విరాళాలు సేకరించి అందజేశామని టీడీపీ నాయకులు చెప్పారు.

**నంద్యాల రూరల్:** విజయవాడ వరదబాధితులకు సీఎం సహాయ నిధికి నంద్యాల జిల్లా ఎలక్ట్రికల్ కాంట్రాక్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూ.1.50లక్షల చెక్కును ఆ సంఘం నాయకులు వాకా వరప్రసాద యాదవ్, మధుశేఖర్ మంత్రి ఫరూక్‌కు సోమవారం అందజేశారు. తమవంతు సాయంగా అందజేసినట్లు వారు చెప్పారు. మాజీ కౌన్సిలర్ శివశంకర్ యాదవ్, విజయశేఖర్, శరత్‌కుమార్, అసోసియేషన్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

- విజయవాడలోని వరద బాధితులకు నంద్యాల గురురాఘవేంద్ర విద్యా సంస్థల యాజమాన్యం బాసటగా నిలిచింది. వెయ్యి కుటుంబాలకు పది కిలోల చొప్పున బియ్యం ప్యాకెట్లు, సీఎం సహాయ నిధికి రూ.2.50 లక్షల విరాళం అందజేయనున్నట్లు గురురాఘవేంద్ర విద్యాసంస్థల చైర్మన్ డా.దస్తగిరిరెడ్డి తెలిపారు. సోమవారం బియ్యం బస్తాల లారీలను విజయవాడకు తరలించారు. డా.దస్తగిరిరెడ్డి, రామకృష్ణ విద్యాసంస్థల చైర్మన్ డా.రామకృష్ణారెడ్డి, ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు డా.రవి కృష్ణలు హాజరై జెండా ఊపి లారీని ప్రారంభించారు. విద్యాసంస్థల డైరెక్టర్లు మౌలాలిరెడ్డి, షేక్షావలిరెడ్డి, నంద్యాల లయన్స్‌క్లబ్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## 'వక్ఫ్ ఆస్తులను కాపాడాలి'

**నంద్యాల రూరల్, సెప్టెంబరు 16:** జిల్లాలో వక్ఫ్ ఆస్తులను కబ్జాల నుంచి కాపాడాలని నంద్యాల ముస్లిం జేఏసీ గౌరవాధ్యక్షులు అబులైస్, అబ్దుల్ సమ్మద్ కోరారు. సోమవారం నంద్యాలలో మంత్రి ఫరూక్‌ను కలిసి జేఏసీ నాయకులు వినతిపత్రం అందించారు. ఫిరోజ్‌పై జరిగిన దాడిని జేఏసీ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. దాడికి పాల్పడినవారిని చట్టపరంగా శిక్షించాలన్నారు. కల్లుకుంట గ్రామంలో దళిత మహిళపై జరిగిన మూకదాడిని మానవత్వానికి మచ్చగా పేర్కొంటూ దాడికి కారణమైనవారిని కఠినంగా శిక్షించాలన్నారు. గోవిందమ్మ కుటుంబానికి రక్షణ కల్పించాలని కోరారు. ముస్లింల సంక్షేమం కోసం వక్ఫ్ ఆస్తుల నుంచి 15 ఎకరాలను కేటాయించాలని వాటిలో పాఠశాల, కమ్యూనిటీ భవనం, మెటర్నిటి హాస్పిటల్, షాపింగ్‌కాంప్లెక్స్, ఈద్గా, స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్‌సెంటర్ వంటి భవిష్యత్తు అభివృద్ధి పనులకు స్థలాలు కేటాయించాలని మంత్రిని కోరారు.

## 'నిత్యావసరాలు పంపిణీ చేయాలి'

**ఆత్మకూరు, సెప్టెంబరు 16:** బహిరంగ మార్కెట్‌లో నిత్యావసర సరుకుల ధరలు ఆకాశానికి చేరుతున్న నేపథ్యంలో పౌర సరఫరాల శాఖ తరుపున చౌక దుకాణాల్లో 14 రకాల నిత్యావసర సరుకులను పంపిణీ చేయాలని సీపీఎం నాయకులు రణధీర్, రామ్‌నాయక్, సురేంద్రలు పేర్కొన్నారు. ఈమేరకు సోమవారం స్థానిక ఆ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. పెరిగిన నిత్యావసర సరుకుల ధరలతో పేద, మధ్య తరగతి ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారని అన్నారు. దీనికితోడు ఇంధన ధరలు పెరగడంతో పరోక్షంగా అన్ని ధరలు పెరిగినట్లు తెలిపారు. ఎన్నికల ముందు పెరిగిన ధరలను తగ్గిస్తామని చెప్పిన పాలకులు ఇంతవరకు పట్టించుకోకపోవడం సరికాదని అన్నారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి పెరిగిన నిత్యావసర సరుకుల ధరలను తగ్గించాలని వారు డిమాండ్ చేశారు.

## 'దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి'

**ఆత్మకూరు, సెప్టెంబరు 16:** కర్నూలు జిల్లాలోని పెద్దకడబూరు మండలంలోని కల్లుకుంట గ్రామంలో గోవిందమ్మ అనే మహిళపై జరిగిన సామాజిక హింసకు కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలని ఏపీ గిరిజన సంఘం నాయకులు నరసింహానాయక్, రామ్‌నాయక్‌లు పేర్కొన్నారు. సోమవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. ఆరు నెలల క్రితం జరిగిన ఓ కులాంతర వివాహానికి సంబంధించి ఓ దళిత యువకుడి తల్లి గోవిందమ్మపై గ్రామస్థులు స్తంభానికి కట్టేసి దాడి చేయడం హేయనీయకరమని అన్నారు. ఈ చర్యకు పాల్పడిన నిందితులపై కేసు నమోదు చేసి చట్టపరంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

## 'నష్టపోయిన రైతులను ఆదుకోవాలి'

**కొత్తపల్లి, సెప్టెంబరు 16:** ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పంటలు దెబ్బతిని నష్టపోయిన రైతులను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని నందికొట్కూరు మాజీ ఎమ్మెల్యే లబ్బి వెంకటస్వామి కోరారు. సోమవారం లబ్బి వెంకటస్వామి కొత్తపల్లి మండలంలోని కొలనుభారతి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆయనకు పురోహితులు అమ్మవారి చిత్రపటాన్ని అందజేసి శాలువాతో సన్మానించారు. అనంతరం స్థానిక ఆర్యవైశ్య సత్రంలో లబ్బి విలేకరులతో మాట్లాడారు. దెబ్బతిన్న పంటలను వ్యవసాయ, రెవెన్యూ అధికారులు నిష్పక్షపాతంగా వ్యవహరించి క్షేత్ర స్థాయిలో పంటలను పరిశీలించి ప్రభుత్వానికి నివేదించాలన్నారు. కొలనుభారతి ఆలయ పనులను పూర్తి చేయాలన్నారు. రమణారెడ్డి, కొక్కెరంచ సర్పంచ్ విష్ణువర్ధన్ రెడ్డి, కొలనుభారతి ఆలయ చైర్మన్ వెంకట నాయుడు, మండల కోఆప్షన్ సభ్యుడు గౌస్, మండల మాజీ వైస్ ప్రెసిడెంట్ మహబూబ్ బాషా, మాజీ సర్పంచ్ మల్లికార్జున యాదవ్, వైస్ సర్పంచ్ నాగన్న పాల్గొన్నారు.

## పిల్లలకు వాహనాలు ఇవ్వొద్దు: డీఎస్పీ


ప్రజలకు అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ రామాంజి నాయక్

**కొత్తపల్లి, సెప్టెంబరు 16:** పిల్లలకు ద్విచక్ర వాహనాలు, నాలుగు చక్రాల వాహనాలు ఇవ్వవద్దని, ప్రమాదాలు జరిగితే పెద్దలను బాధ్యులను చేస్తామని ఆత్మకూరు డీఎస్పీ రామాంజినాయక్ హెచ్చరించారు. సోమవారం దుద్యాల గ్రామ బస్టాండు సెంటరులో ఎస్ఐ కేశవ అధ్యక్షతన పోలీసు శాఖ పలు అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ గ్రామాల్లోని ప్రధాన కూడళ్లలో కచ్చితంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. అలాగే ఓటీపీ ఫ్రాడ్స్ మహిళలు, చిన్నపిల్లలపై జరిగే నేరాలపై వివరించారు. అనుమానితులు గ్రామాల్లో సంచరిస్తుంటే.. పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఆధార్, బ్యాంకు అకౌంటు తదితరు వివరాలు ఎవరినైనా అడిగితే సమాచారం ఇవ్వొద్దని సూచించారు. ఆత్మకూరు సీఐ సురేష్ కుమార్ రెడ్డి, పోలీసు సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

## 22న ఏపీటీఎఫ్ వైజ్ఞానిక మహాసభ


మంత్రికి ఆహ్వాన పత్రికను అందజేస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

**నంద్యాల రూరల్, సెప్టెంబరు 16:** ఏపీటీఎఫ్ ఆవిర్భవించి 80 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా నంద్యాలలో ఈ నెల 22న ఏపీటీఎఫ్ జిల్లా విద్యా, వైజ్ఞానిక మహాసభ ఓక్‌జూబ్లీ వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం రాష్ట్రకమిటీ సభ్యుడు సాంబశివుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి నగిరి శ్రీనివాసులు తెలిపారు. సోమవారం నంద్యాలలోని టీడీపీ కార్యాలయంలో మంత్రి ఫరూక్‌ను ఏపీటీఎఫ్ నాయకులు కలిసి వేడుకకు హాజరు కావాలని ఆహ్వానపత్రికను అందజేశారు. శ్రీనివాసులు మాట్లాడుతూ ఓక్ జూబ్లీ వేడుకకు జిల్లాలోని ఉపాధ్యాయులు, మేధావులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా పీఈటీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రవికుమార్, స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి శివకుమార్, ఏపీటీఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

## పాణ్యం యువకుడికి అమెరికాలో అరుదైన గౌరవం

### బోస్టన్ ఎంఐటీ యూనివర్సిటీ సదస్సులో న్యాయనిర్ణేత


గౌతమ్

**పాణ్యం, సెప్టెంబరు 16 :** అమెరికాలోని ప్రతిష్టాత్మక ఎంఐటీ విశ్వవిద్యాలయంలో జరిగిన సదస్సులో న్యాయ నిర్ణేతగా పాణ్యం గ్రామం అయ్యపురెడ్డి కాలనీకి చెందిన రైల్వే ఉద్యోగి పొన్నాన అశీరన్న కుమారుడు గౌతం ఎంపిక అయ్యారు. అమెరికాలోని బోస్టన్ ఎంఐటీ విశ్వవిద్యాలయంలో నిర్వహించిన ప్రపంచ అతిపెద్ద హ్యాక్‌థాన్‌లో విద్యార్థుల ప్రాజెక్టులను అభివృద్ధి చేయడానికి సదస్సులో పాల్గొన్నట్లు గౌతం తెలిపారు. సోమవారం ఆయన తండ్రి అశీరన్న మాట్లాడుతూ ఈనెల 15, 16 తేదీలలో భారత దేశం బోస్టన్ యూనివర్శిటీలో జరిగిన ఈవెంట్‌లో గౌతం పాల్గొన్నట్లు తెలిపాడు. ఈ ఈవెంట్‌లో ప్రపంచంలోని హార్వర్డ్, యేల్, స్టాన్‌ఫోర్డ్ వంటి ప్రఖ్యాత విశ్వవిద్యాలయాల నుంచి ప్రతిభావంతులైన విద్యార్థులు ప్రాజెక్టులు అభివృద్ధి చేయటానికి ఈ సదస్సులో పాల్గొంటారన్నారు. విద్యార్థుల ప్రాజెక్టులను ఎంపిక చేయడానికి బోస్టన్ విశ్వవిద్యాలయం చాన్సలర్‌లు భారతదేశం నుంచి ఎంపిక చేసినట్లు తెలిపాడు. న్యాయ నిర్ణేతలలో 19 యేళ్ల అతి చిన్న వయసు కావడంతో పాటు అత్యుత్తమ సాంకేతిక పరిజ్ఞానంతో ప్రత్యేకించి సైబర్ సెక్యూరిటీ, బ్లాక్ చెయిన్‌లో విశేష నైపుణ్యాలు కలిగి ఉండడంతో ఎంపిక చేసినట్లు తెలిపాడు. ఇప్పటి వరకు క్రిప్టో సంస్థల నుంచి 600ల మిలియన్లకు ( 500ల కోట్లకు) పైగా నష్టాన్ని తన నైపుణ్యంతో అరికట్టినందుకు ఈ గౌరవంగా ఆహ్వానించినట్లు తెలిపాడు. శ్రీకాకుళం జిల్లా దరివాడ గ్రామానికి చెందిన లక్ష్మీబాయి, అశీరన్నల కుటుంబం ఐదేళ్ల క్రితం రైల్వే ఉద్యోగరీత్యా పాణ్యంలో నివాసముంటున్నారు. వీరి మొదటి కుమారుడు సాయినికేతన్ నాయుడు తమిళనాడు తిరుచ్చిలో ఎన్ఐటీ చదువుతున్నాడు.

## 19న స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఎంపిక పోటీలు

**ఆత్మకూరు, సెప్టెంబరు 16:** మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు ఈ నెల 19వ తేదిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఎంపిక పోటీలను నిర్వహిస్తున్నట్లు మండల కోఆర్డినేటర్ ఎస్.శంకరయ్య తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. ఆత్మకూరు పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడామైదానం నందు ఈ నెల 19వ తేదిన గురువారం ఉదయం 9.30గంటలకు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్-14, అండర్-17 విభాగాల్లో బాలబాలికలకు ఎంపిక పోటీలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ పోటీల్లో ప్రధానంగా కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, షటిల్, బ్యాడ్మింటన్, యోగా అథ్లెటిక్స్, చెస్ విభాగాల్లో ఎంపిక ఉంటుందని వివరించారు. ఆసక్తి గల క్రీడాకారులు క్రీడాకారుల పేర్లతో కూడిన ఫారమ్‌లో హెచ్ఎం సంతకంతో హాజరు కావాలని సూచించారు.

## 'ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధం'

**ఆత్మకూరు, సెప్టెంబరు 16:** ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధమని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు శీలం శేషు, జిల్లా అధ్యక్షుడు మల్లయ్య, జేఏసీ అధ్యక్షుడు సాంబశివుడు అన్నారు. సోమవారం అంబేడ్కర్ స్ఫూర్తి కేంద్రంలో నిర్వహించిన ఆ సంఘం ముఖ్య నాయకుల సమావేశంలో వారు మాట్లాడారు. రాజకీయ స్వార్థం కోసం జరిగిన ఎస్సీ వర్గీకరణ తీర్పును ఉపసంహరించుకునే వరకు తమ పోరాటం ఆగదని స్పష్టం చేశారు. నాయకులు రాజగోపాల్, రేణుక్క, బాలరాజు, నగేష్, వెంకటరమణ, సుధాకర్, రాఘవేంద్ర, మహేష్, అబ్రహం తదితరులు ఉన్నారు.

## సేవా కార్యక్రమాలతోనే సంతృప్తి : ఆకుల నాగిరెడ్డి



బాడీ ఫ్రీజర్ బాక్స్‌ను గ్రామ పెద్దలకు అందిస్తున్న ఆకుల నాగిరెడ్డి

**అవుకు, సెప్టెంబరు 16 :** సేవా కార్యక్రమాలతోనే సంతృప్తి కలుగుతుందని కొండమనాయునిపల్లె గ్రామ టీడీపీ నాయకుడు ఆకుల నాగిరెడ్డి అన్నారు. సోమవారం కొండమనాయునిపల్లె గ్రామ పెద్దలకు నాగిరెడ్డి దాదాపు రూ. లక్ష విలువ చేసే బాడీ ఫ్రీజర్ బాక్స్‌ను అందించి ఉదారతను చాటుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన తండ్రి ఆకుల నర్సిరెడ్డి జ్ఞాపకార్థం కొండమీది గ్రామాల ప్రజలకు బాడీ ఫ్రీజర్ బాక్స్‌ను అందుబాటులోకి తెచ్చానన్నారు. ఈ బాక్స్‌ను ఉంచేందుకు రేకుల షెడ్డును నిర్మించామన్నారు. గతంలో కొండమనాయునిపల్లె, జూనుంతల, ఉప్పలపాడు, పిక్కెళ్లపల్లెతండా, మారేమడుగుల, కునుకుంట్ల, మన్నేనాయక్‌తండా, ఇస్రానాయక్‌తండాల్లో ఎవరైనా మృతి చెందితే బాడీ ఫ్రీజర్ కోసం అవుకు లేదా కొలిమిగుండ్ల గ్రామాలకు వెళ్లాల్సి వచ్చేదన్నారు. పైగ్రామాల్లో ఎవరైనా మృతి చెందినా బాడీ ఫ్రీజర్ బాక్స్‌ను ఉచితంగా తీసుకెళ్లొచ్చని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు వెంకట శివారెడ్డి, ఆకుల విశ్వనాథరెడ్డి, బోర్ శివారెడ్డి, శివయ్య, హనుమానాయక్, పీవీ వెంకటేష్, లక్ష్మన్న, మండ్ల వెంకటేష్, శ్రీరాములు యాదవ్ తదితరులు పాల్గొన్నారు,

## పైపులైన్ ధ్వంసం.. తాగు నీరు వృథా



జి.జంబులదిన్నెలో వృథాగా పోతున్న తాగు నీరు

**ఆళ్లగడ్డ, సెప్టెంబరు 16:** మండలంలోని జి.జంబులదిన్నె గ్రామంలోని దర్గా వద్ద పైపులైన్ పగిలిపోవడంతో సోమవారం తాగునీరు వృథాగా పోయింది. నీరు వృథా అవుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోయారు. తాగునీటి వృథాను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



కొత్తపల్లి ఉన్నత పాఠశాలలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

**డోన్(రూరల్), సెప్టెంబరు 16:** మండలంలోని కొత్తపల్లి గ్రామ ఉన్నత పాఠశాలలో 2006-07 విద్యాసంవత్సరానికి చెందిన పదవ తరగతి విద్యార్థుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహించుకున్నారు. అప్పటి జ్ఞాపకాలను నెమరు వేసుకుని సంతోషంగా గడిపారు. నాటి గురువులను లోక్‌నాథ్ రెడ్డి, హరిణీదేవి, త్రివేణి, శాంతకుమారి, అనురాధ, రాంప్రసాద్‌లను పూర్వ విద్యార్థులు సన్మానించారు.

## సిద్ధ రామేశ్వర స్వామి ఆలయంలో పూజలు

**కొలిమిగుండ్ల, సెప్టెంబరు 16 :** మండలంలోని బెలుం గ్రామంలో వెలసిన పురాతన సిద్ధ రామేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేకపూజలు నిర్వహించారు. సోమవారం పౌర్ణమిని పురస్కరించుకొని పలువురు భక్తులు స్వామివారికి అభిషేకాలు నిర్వహించినట్లు అర్చకుడు మహేష్ శర్మ వెల్లడించారు. అనంతరం స్వామికి ప్రత్యేక అలంకరణ చేపట్టి, భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు.

## పైప్‌లైన్ లీకేజీకి మరమ్మతులు

**కొలిమిగుండ్ల, సెప్టెంబరు 16 :** మండలంలోని ఎర్రగుడి గ్రామంలో సర్పంచ్ సుబ్బలక్ష్మీ, కంబ గిరిస్వామి ఆధ్వర్యంలో పైప్ లైన్ లీకేజీ పనులు చేపట్టారు. గ్రామంలోని సాయిబాబా గుడి ప్రధాన రహదారి గుండా వెళ్లే పైప్‌లైన్‌కు మరమ్మతులు చేయించారు. అలాగే ఎర్రగుడి మజారా గ్రామమైన హనుమంతు గుండం బస్టాండ్ నుంచి చిన్నచెరువు వరకు ప్రధాన రహదారిలో కంప చెట్లను తొలగించారు. పరిసరాల పరిశుభ్రత పాటించాలని సర్పంచ్ కోరారు.



ఎర్రగుడిలో లీకేజీ పనులు చేస్తున్న సిబ్బంది

## రక్త దానం చేసి ప్రాణ దాతలు కావాలి



రక్తదానం చేస్తున్న పారిశ్రామికవేత్త మారుతీకృష్ణ శర్మ

**బేతంచెర్ల, సెప్టెంబరు 16 :** రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని ఎంపీపీ బుగ్గన నాగభూషణంరెడ్డి, నగర పంచాయతీ ఛైర్మన్ చలం రెడ్డి, టీడీపీ సీనియర్ నాయకురాలు బుగ్గన ప్రసన్నలక్ష్మి, గౌరీ హుశేన్ రెడ్డి యువతకు పిలుపునిచ్చారు. మహ్మద్ ప్రవక్త జన్మదినం సందర్భంగా మతసామరస్య చైతన్య వేదిక ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలోని శేషారెడ్డి ఉన్నత పాఠశాల ప్రాంగణంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ప్రముఖ పారిశ్రామికవేత్త మారుతిశర్మ, బుగ్గన చంద్రారెడ్డి, పోలూరు రాఘవరెడ్డి, గౌరు హుశేన్ రెడ్డి, ముర్తుజా వలి, జాకీరుల్లాబేగ్, బాబుల్ రెడ్డి, ఖాజా హుశేన్ హాజరయ్యారు. నంద్యాల ప్రభుత్వ హాస్పిటల్ బ్లడ్ బ్యాంకు సిబ్బంది, టెక్నీషియన్లు 120 మంది దాతల నుంచి రక్తం సేకరించారు. కార్యక్రమంలో మత సామరస్య చైతన్య వేదిక ప్రెసిడెంట్ నూర్ అహ్మద్, సెక్రటరీ జయంత్‌గౌడ్, సంస్థ సభ్యులు అబ్దుల్ ఖాదర్, రషీద్, జాకీర్, నజీర్, అల్లాబకాష్, గౌస్, రామకృష్ణ, దస్తగిరి, శేషు, పీర్‌బాషా, రవి, మధు, రఫీ పాల్గొన్నారు.

## ఇసుక ట్రాక్టర్ స్వాధీనం

**ఉయ్యాలవాడ, సెప్టెంబరు 16:** మండలంలోని అల్లూరు గ్రామ సమీపంలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ రామాంజనేయరెడ్డి సోమవారం తెలిపారు. ఆదివారం తెల్లవారుజామున వాహన తనిఖీలు చేపట్టగా జమ్మలమడుగు పట్టణానికి చెందిన ఇసుక ట్రాక్టర్ ఓవర్‌లోడ్‌తో కోవెలకుంట్లకు వెళ్తుండగా గుర్తించామని చెప్పారు. ట్రాక్టర్‌ను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

# రైతుకు క(న)ష్టం..

- కరుణించని వరుణుడు
- అడుగంటుతున్న భూగర్భ జలాలు
- ఎండుతున్న పంట పొలాలు
- ఆందోళనలో రైతన్నలు
- ఏడు ఎకరాల్లో వరి పంటకు నిప్పు పెట్టిన వైనం

**ఇటీవల రాష్ట్రాన్ని వరదలు ముంచెత్తాయి. అయితే కొలిమిగుండ్ల మండలంలో మాత్రం చినుకు కురవలేదు. ఖరీఫ్ ప్రారంభం నుంచి నేటి వరకు ఓ భారీ వర్షం కురవకపోవంతో చెరువులు, కుంటలు, బోరు బావులు అడుగంటాయి. వేసిన పంటలకు నీరు లేక ఎండిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.**





వరి పంటకు నిప్పు పెట్టిన రైతు పెద్దబాబయ్య

**కొలిమిగుండ్ల, సెప్టెంబరు 16 :** మండలంలో చినుకు కరువైంది. దీంతో భూగర్భజలాలు అడుగంటాయి. అడపాదడపా కురిసిన పంటలు కూడా ఎండుముఖం పట్టాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కోరుమానుపల్లె, అబ్దులాపురం గ్రామాలకు చెందిన రైతులు వరి, వేరుశనగ పంటలు వదిలేశారు. అలాగే కోరుమానుపల్లెకు చెందిన చిన్నమాబు, పెద్దబాబయ్య అనే రైతులు బోరు బావుల కింద ఏడుఎకరాల్లో వరి పంటను సాగు చేశారు. అయితే వర్షాలు కురువక పోవడంతో బోరు బావుల్లో నీరు అడుగంటి పోయింది. సోమవారం పంట పొలాలకు నిప్పు పెట్టినట్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఎకరం వరి సాగుకు సుమారు రూ.30వేల వరకు పెట్టుబడి పెట్టామని, రూ.2లక్షలకు పైగా నష్టపోయినట్లు బాధిత రైతులు వాపోయారు. ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని కోరారు.

# సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి

**చాగలమర్రి, సెప్టెంబరు 16:** గ్రామాల్లో ప్రజలు సీజన్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా సహాయాధికారి వరప్రసాద్‌రెడ్డి తెలిపారు. సోమవారం మంచం పట్టిన తోడెండ్లపల్లె అన్న శీర్షికతో ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. స్పందించిన వైద్యాధికారులు, వైద్య సిబ్బంది కలిసి వైద్య శిబిరం గ్రామంలో ఏర్పాటు చేశారు. మలేరియా సహాయాధికారి మాట్లాడుతూ గ్రామంలో 302 గృహాలు ఉన్నాయని, ఇంటింటికి వెళ్లి జ్వర పీడితులను గుర్తించామని చెప్పారు. జ్వరాలు సోకిన వారికి రక్త పూత పరీక్షలు చేశామని చెప్పారు. మురుగు నిల్వ ఉన్న చోట హెబిట్ ద్రావణంతో పిచికారీ చేయించామన్నారు. దోమల నివారణకు ఫాగింగ్ చేయించామన్నారు. వైద్యులు శివమోహన్ ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. ఆళ్లగడ్డ సబ్ యూనిట్ అధికారి శివచంద్రారెడ్డి, ఆరోగ్య విస్తరణాధికారి సుబ్బరాయుడు, సీహెచ్‌వో తేజ, ఏఎన్ఎంలు, రాణి, సుభాషిణి, ఆశా కార్యకర్తలు ఉన్నారు.

- గ్రామాల్లో పారిశుధ్యంపై కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు దృష్టి సారించాలని ఎంపీడీవో మహబూబ్‌దౌల, ఈవోఆర్డీ తాహిర్‌హుసేన్ తెలిపారు. సోమవారం తోడెండ్లపల్లె గ్రామంలో పారిశుధ్య నిర్వహణకు చర్యలు తీసుకున్నారు.



తోడెండ్లపల్లెలో మురుగు నీరు వద్ద హెబిట్ ద్రావణాన్ని పిచికారీ చేయిస్తున్న జిల్లా మలేరియా అధికారులు

## నేటి నుంచి స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాలు

**కోవెలకుంట్ల, సెప్టెంబరు 16 :** కోవెలకుంట్లలో మంగళవారం నుంచి వచ్చేనెల ఒకటి వరకు స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఈవో గోపీనాథ్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ మేజరు గ్రామ పంచాయతీ సర్పంచ్ మెట్ల సరళ ఆధ్వర్యంలో ఉదయం కార్యక్రమాలు ఉంటాయని వివరించారు. గ్రామ నాయకులు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## సారా స్వాధీనం

**రుద్రవరం, సెప్టెంబరు 16 :** మండలంలోని హరినగరం గ్రామంలో సారా స్థావరాలపై దాడులు నిర్వహించినట్లు ఎస్ఐ వరప్రసాద్ సోమవారం తెలిపారు. రాజు అనే వ్యక్తిని అదుపులోకి తీసుకొని అతని వద్ద నుంచి ఎనిమిది లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు. నిందితుడిని కోర్టులో హాజరుపరచగా న్యాయాధికారి రిమాండ్‌కు ఆదేశించినట్లు ఎస్ఐ తెలిపారు.

## వైభవంగా విశ్వకర్మ జయంతి



విశ్వకర్మకు పూజలు చేస్తున్న భక్తులు

**బనగానపల్లె, సెప్టెంబరు 16 :** మండలంలోని పలుకూరు గ్రామంలో విశ్వకర్మ జయంతి ఉత్సవాలు సోమవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వీరబ్రహ్మంగారి చిత్రపటానికి, విశ్వకర్మ చిత్రపటానికి పూల మాలలు వేసి పూజలు చేశారు. జేకేఆర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు బ్రహ్మానందచారి విశ్వకర్మ యొక్క సేవలను, ప్రాధాన్యతను భక్తులకు వివరించారు. కార్యక్రమంలో హనుమంతు, వెంకటసుబ్బయ్య, రాజు, సుబ్బారెడ్డి, రాంపుల్లారెడ్డి పాల్గొన్నారు.

## నేడు చౌడేశ్వరీ దేవి జ్యోతుల ఉత్సవాలు

**కోవెలకుంట్ల, సెప్టెంబరు 16 :** మండంలోని బిజినవేముల గ్రామంలో మంగళవారం చౌడేశ్వరిదేవి జ్యోతుల ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు టీడీపీ గ్రామ నాయకులు గజ్జల హుసేనయ్య, రాధాక్రిష్ణమూర్తి, మనోహర్, సుబ్బరాయుడు తెలిపారు. సోమవారం వారు మాట్లాడుతూ మహాలయ పౌర్ణమి పండుగను పురస్కరించుకొని గ్రామంలో చౌడేశ్వరిదేవి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. మంగళవారం రాత్రి జ్యోతి ఉత్సవాలు జరుగుతాయన్నారు.

- బిజినవేముల గ్రామంలో నిర్వహిస్తున్న చౌడేశ్వరిదేవి జ్యోతుల ఉత్సవాలకు మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి సతీమణి బీసీ ఇందిరమ్మ, మంత్రి సోదరులు బనగానపల్లె మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి, పారిశ్రామికవేత్త బీసీ రామనాథరెడ్డి హాజరుకానున్నట్లు సోమవారం గ్రామ నాయకుడు గడ్డం భక్తప్రహ్లాదరెడ్డి తెలిపారు.

## 'మైనార్టీలపై దాడులను సహించం'

**ఆళ్లగడ్డ, సెప్టెంబరు 16:** మైనార్టీలపై దాడులు చేస్తే సహించేది లేదని ఆళ్లగడ్డ ముస్లిం నాయకులు అన్నారు. సోమవారం వారు మాట్లాడుతూ మైనార్టీల సంక్షేమం, న్యాయశాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ కుమారుడు ఫిరోజ్‌పై దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. రాజకీయంగా ముస్లిం నాయకుడు ఎదుగుదలను ఓర్వలేకనే ఈ దాడి చేశారన్నారు. నిందితులను కఠినంగా శిక్షించాలని నాయకులు పోలీసులను కోరారు.

# ఘనంగా మిలాద్ ఉన్ నబీ



చాగలమర్రిలో అన్నదానం చేస్తున్న మతపెద్దలు



బనగానపల్లెలో ర్యాలీలో పాల్గొన్న మత పెద్దలు

**చాగలమర్రి, సెప్టెంబరు 16:** మండలంలోని ఆయా గ్రామాల్లో ముస్లింలు సోమవారం మహమ్మద్ ప్రవక్త జయంతి సందర్భంగా మిలాద్ ఉన్ నబీ పండుగను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. చాగలమర్రి చిన్నమకానం వీధిలోగల ఆసరాలో కమిటీ సభ్యులు మాబు షరీఫ్, గౌస్‌పీర్, భూమా యువసేన సభ్యుడు రజాక్, మాబుహుసేన్ ఆధ్వర్యంలో ముస్లింలకు అన్నదానం చేశారు. అనంతరం మత పెద్దలు పెట్టెలో భద్రపరిచిన మహమ్మద్ ప్రవక్త తలవెంట్రుకలను ప్రదర్శించారు. కార్యక్రమంలో నాయకులు అనీఫ్, గౌస్ మొహిద్దీన్, అబ్దుల్లా, షఫి, అస్రఫ్, జిలేబి షరీఫ్, లడ్డు బాషా పాల్గొన్నారు.

**రుద్రవరం:** రుద్రవరం మండలంలో సోమవారం మిలాద్ ఉన్ నబీని ముస్లింలు ఘనంగా నిర్వహించారు. రుద్రవరం, చిన్నకంబలూరు, పెద్దకంబలూరు, ఆలమూరు, నరసాపురం, కోటకొండ, యల్లావత్తుల, ముత్తలూరు గ్రామాల్లో మహ్మద్‌ప్రవక్త జన్మదిన సందర్భంగా ప్రత్యేక నమాజ్ చేశారు.

**ఆళ్లగడ్డ:** ఆళ్లగడ్డ పట్టణం, మండలంలోని గ్రామాల్లో మిలాద్ ఉన్ నబీ పండుగను ముస్లింలు సోమవారం ఘనంగా జరుపుకున్నారు. మసీదులకు వెళ్లి ప్రార్థనలు చేశారు.

**ప్యాపిలి:** పట్టణంలో సోమవారం మిలాద్ ఉన్ నబి వేడుకలను ముస్లింలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా జామియా మజీద్‌లో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు.

**సంజామల:** మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో ముస్లింలు మిలాద్ ఉన్ - నబీ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఆయా గ్రామాల్లో మసీదును అలంకరించి ప్రత్యేక నమాజులు చేశారు.

**కొలిమిగుండ్ల:** మండలంలోని వివిధ గ్రామాల్లో ముస్లింలు మిలాద్-ఉన్-నబీ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కొలిమిగుండ్ల, తుమ్మలపెంట, అంకిరెడ్డిపల్లె తదితర గ్రామాల్లో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ర్యాలీ నిర్వహించి, ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. మండల ఖాజీ ఖాదర్‌వలి, మత పెద్దలు మహమ్మద్ ప్రవక్త జననం, ఆయన బోధనల సారాంశాన్ని తెలియజేశారు.

**బేతంచెర్ల:** మహ్మద్ ప్రవక్త అడుగుజాడల్లో ముస్లింలు నడవాలని మండల ఖాజీ నూరు అహ్మద్ పిలుపునిచ్చారు. మహ్మద్ ప్రవక్త జయంతి మిలాదు- ఉన్- నబీ వేడుకలను ముస్లింలు అత్యంత భక్తి శ్రద్ధలతో సోమవారం నిర్వహించారు. ఆసర్‌పేటలోని దర్గాలో మహ్మద్ ప్రవక్త కేశాలను భక్తులను తిలకించడానికి ప్రదర్శనగా ఉంచారు.

**బనగానపల్లె:** బనగానపల్లె పట్టణంలో మిలాద్-ఉన్-నబీ పర్వదిన వేడుకలను ముస్లింలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అబ్దుల్ హుసేన్ సాహెబ్, హుసేన్ ఖాద్రి తదితరుల ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. సీఐ కృష్ణయ్య యాదవ్ బందోబస్తు నిర్వహించారు.



ప్యాపిలిలో ర్యాలీ చేస్తున్న ముస్లింలు



మహ్మద్ ప్రవక్త సందేశాన్ని ముస్లింలకు వినిపిస్తున్న మండల ఖాజీ



మాట్లాడుతున్న సీపీఐ నాయకుడు

## 'ఇచ్చిన హామీ అమలు చేయాలి'

**రుద్రవరం, సెప్టెంబరు 16:** ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అన్నదాత సుఖీభవ పథకం అమలు చేసి రైతులు రూ.20 వేలు చెల్లించాలని సీపీఐ నంద్యాల జిల్లా కార్యదర్శి ఎన్.రంగ నాయుడు, ఆళ్లగడ్డ నియోజకవర్గ కార్యదర్శి భాస్కర్ డిమాండ్ చేశారు. మండలంలోని పెద్దకంబలూరు గ్రామంలో సోమవారం సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయాలన్నారు. అన్నదాత సుఖీభవ పథకం కింద రూ. 20వేలు అందించాలన్నారు. సూపర్‌సిక్స్ పథకాలు అమలు చేయాలని నిత్యావసర ధరలు తగ్గించాలన్నారు. పెట్రోలు, డీజిల్ ధరలు తగ్గించి జీఎస్టీ పరిధిలోకి తీసుకురావాలని కోరారు. వ్యవసాయ పరికరాలు అందించాలన్నారు. ఎ లాంటి పూచీకత్తు లేకండా రూ.2 లక్షల వరకు వడ్డీ లేని రుణాలను బ్యాం కుల ద్వారా అందించి రుణబాధల నుంచి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. న్యా యవాది నరసింహులు మాట్లాడుతూ గ్రామ సమస్యలు గుర్తించి ఎప్పటికప్పు డు సమస్యలు అధికారలు దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కమ్యూనిస్టులు కృషి చేయాలన్నారు. బాబాఫకృద్దీన్, బాలనరసింహుడు, నాగనరసింహుడు, జయన్న పాల్గొన్నారు.

## నేడు శ్రీమద్భాగవత గ్రంథం ఊరేగింపు



పట్టణంలో శ్రీమద్భాగవత కరపత్రాలను విడుదల చేస్తున్న నిర్వాహకులు

**ఆళ్లగడ్డ, సెప్టెంబరు 16:** ఆళ్లగడ్డ పట్టణంలో శ్రీమద్భాగవత గ్రంథ ఊరేగింపు మహోత్సవాన్ని మంగళవారం నిర్వహిస్తున్నట్లు జిల్లా విశ్రాంత న్యాయాధికారి కాశీభట్ల శివప్రసాద్ సోమవారం చెప్పారు. శ్రీమద్ భాగవత గ్రంథ ఆవిర్భావం శుభసందర్భంగా ఆళ్లగడ్డ పట్టణంలోని శ్రీరామాలయం నుంచి శివాలయం వరకు నిర్వహిస్తామని, భక్తులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అలాగే శ్రీమద్భాగవత సప్తాహ కార్యక్రమాన్ని ఈ నెల 17 నుంచి 23వ తేదీ వరకు పట్టణంలోని శివాలయంలో డాక్టర్ వైష్ణవ వెంకట రమణ మూర్తిచే నిర్వహించనున్నట్లు ఆయన చెప్పారు. ఈ సందర్భంగా పట్టణంలో శ్రీమద్భాగవత కరపత్రాలను విడుదల చేశామన్నారు. కార్యక్రమంలో శివాలయం కమిటీ ఛైర్మన్ మల్లేశ్వరరెడ్డి, అర్చకులు రాజేష్ శర్మ, పుష్పబాయ్, ప్రసన్న, విజయలక్ష్మి పాల్గొన్నారు.

## ఆలయ జీర్ణోద్ధరణ పనులు ప్రారంభం



రాంపల్లెలో ఆలయ పనులను ప్రారంభిస్తున్న భూమా జగత్ విఖ్యాతరెడ్డి

**చాగలమర్రి, సెప్టెంబరు 16:** మండలంలోని రాంపల్లె గ్రామంలో ఆగిన కోదండరామాలయాన్ని జీర్ణోద్ధరణ చేయడానికి టీడీపీ నాయకుడు భూమా జగత్ విఖ్యాతరెడ్డి సోమవారం పనులను ప్రారంభించారు. రాంపల్లె గ్రామానికి చేరుకోగానే టీడీపీ నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. రూ.30 లక్షలతో ఆలయ జీర్ణోద్ధరణ పనులు చేసున్నట్లు టీడీపీ నాయకుడు రామిరెడ్డి తెలిపారు. గ్రామంలో ఆలయ పనులు చేపట్టడం అభినందనీయమని భూమా జగత్ అన్నారు. వరదల సమయంలో సీఎం చంద్రబాబు యుద్ధ ప్రాతిపదికన చేపట్టిన సహాయ చర్యలు స్ఫూర్తిదాయకమని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు లక్ష్మీరెడ్డి, కృష్ణారెడ్డి, నాగభూషణం, గ్రామ పెద్దలు, మహిళలు పాల్గొన్నారు.

## జ్వర పీడితులకు వైద్య పరీక్షలు



మల్లేవేములలో వైద్య పరీక్షలు చేస్తున్న ఏఎన్ఎం మంజుల

**చాగలమర్రి, సెప్టెంబరు 16:** మండలంలోని మల్లేవేముల గ్రామంలో సోమవారం జ్వర పీడితులకు వైద్య సిబ్బంది మంజుల, శేఖర్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి వైద్య చికిత్సలు చేశారు. గ్రామంలోని ఎస్సీ కాలనీలో 6 మందికి జ్వరం తీవ్రంగా ఉన్నట్లు గుర్తించి రక్తపూత పరీక్షలు చేశారు. మందులు పంపిణీ చేశారు. 50 మందికి వైద్య పరీక్షలు చేసి వ్యాధుల నివారణపై అవగాహన కల్పించారు. వైద్యులు వెళ్లకుండా వైద్య సిబ్బందితోనే వైద్య శిబిరం నిర్వహించడంతో జ్వర పీడితులు, గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వైద్య శిబిరాలు ఏర్పాటు చేసిన రోజు కూడా చికిత్సలు చేసేందుకు వైద్యులు రాకపోవడం బాధాకరం అన్నారు. ఎఫ్‌డీపీ కార్యక్రమాలకు మాత్రమే వైద్యులు హాజరవుతారని అన్నారు.

## ప్రజల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం : ఎమ్మెల్యే



తోడెండ్లపల్లెలో జ్వర పీడితులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ

**చాగలమర్రి, సెప్టెంబరు 16:** ప్రజల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అన్నారు. సోమవారం సాయంత్రం తోడెండ్లపల్లె, మల్లేవేముల గ్రామాల్లో వైరల్ ఫీవర్‌తో ప్రజలు ఇబ్బందులు పడుతున్న విషయం తెలుసుకున్న ఆమె ఆయా గ్రామాల్లో పర్యటించారు. ఇంటింటికి వెళ్లి వైరల్ ఫీవర్‌తో బాధపడుతున్న వారిని పరామర్శించి తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో రెండు రోజుల పాటు మంచి నీటిని ట్యాంకర్ల ద్వార తెప్పించి ప్రజలకు అందించాలని అధికారులకు ఆదేశించారు. వైరల్ ఫీవర్, దగ్గు, జలుబు వంటి లక్షణాలు ఉంటే అధికారులకు తెలియజేయాలని, ఆశా వర్కర్లు గ్రామాల్లో అందుబాటులో ఉంటారని, వారికి సమాచారం ఇవ్వాలని తెలిపారు. తోడెండ్లపల్లె గ్రామంలో 15 కేసులు, మల్లేవేముల గ్రామంలో 12 కేసులు ఉన్నాయని తెలిపారు. జ్వరాలు ఉన్న వారికి బ్లెడ్ షాంపిల్స్ తీసుకొని ల్యాబ్‌కు పంపించారని అన్నారు. చిన్న పిల్లల పట్ల అప్రమత్తంగా ఉండాలని తల్లిదండ్రులకు సూచించారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా సహాయ అధికారి వరప్రసాదురెడ్డి, ఆళ్లగడ్డ సబ్ యూనిట్ మలేరియా అధికారి శివచంద్రారెడ్డి, ఎన్‌జీవో రాష్ట్ర ఉపాధ్యక్షుడు దస్తగిరిరెడ్డి, ఎంపీడీవో మహబూబ్‌దౌల, ఈవోఆర్డీ తాహిర్‌హుసేన్, వైద్యులు శివమోహన్, సూపర్‌వైజర్ రామలింగారెడ్డి, గ్రామ సర్పంచ్ ఈదుల సరోజమ్మ, నాయకులు శ్రీనివాసరెడ్డి, ఉసేన్‌రెడ్డి, రామ్మోహన్, సంజీవరెడ్డి, జనార్దన్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, జగన్ పాల్గొన్నారు.